ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5 మంగళవారం 10 సెప్టెంబరు 2024





బాపట్ల: జమ్ములపాలెం వెళ్ళేరోడ్డులో కాల్వ కట్టలు సరిగా లేక ముంపునకు గురైన పొలాలు.

ఐదేళ్ల పాపం.. డెల్టాకు శాపం

కృష్ణా పశ్చిమ డెల్టాలో వరిచేలు మునిగిపోయి పక్షం రోజులు దాటిపోతోంది. ఇన్ని రోజులవుతున్నా నీటి అడుగునున్న పంట ఇంకా బయటపడటంలేదు. నీరు పంట పొలాలను వదిలిపోవటంలేదు. కారణం!... ఒక్క డ్రెయిన్‌కూడా ముంపు నీటిని సముద్రంలోకి తీసుకుపోయే పరిస్థితిలో లేదు. చేలల్లో నీటిని బయటకు పంపాల్సింది పోయి డ్రెయిన్‌లలో నీరే కట్టలు తెంచుకుని మరీ చేలపై పడిపోతున్నాయి. కొన్నిచోట్లయితే డ్రెయిన్‌లు, పొలాలు ఏకమైపోయాయి. కృష్ణా తీరంలో లక్షల క్యూసెక్కులు వచ్చిన వరద వెనక్కివెళ్లిపోతే, మాగాణి చేలల్లో వర్షాలు ముంచేసిన పంట మాత్రం ఇంకా నీటి అడుగునే కుళ్లిపోతోంది. ఇంతకీ ఈ పాపం ఎవరిది? అప్పులుచేసి, చెమటోడ్చి పంట పండించే డెల్టా రైతన్నకు ఇంత కష్టం రావటానికి కారకులెవరు? అన్ని ప్రశ్నలకు ఒకే సమాధానం... గత ప్రభుత్వం చేసిన పాపమే ఇప్పుడు రైతన్నకు శాపంగా మారిందని, పంట పండించేందుకు నీరు లేక అవస్థలు పడినరోజులు పోయి, అతివృష్టిని తలపించే వాననీటి ముంపు రైతన్నకంట కన్నీరు తెచ్చిపెడుతోంది. కృష్ణా డెల్టా చరిత్రలో ఇంతటి దారుణ పరిస్థితులు గతంలో ఎన్నడూ లేకపోయినా ఇప్పుడు దాపురించాయి.

- ఒక్క ఖరీఫ్‌కు ముందూ కాల్వల మరమ్మతులు చేసింది లేదు..
- డ్రెయిన్‌ల పరిస్థితి మరీ దారుణం
- నేడు గండ్లు పడటానికి, పంట మునగటానికి అదే కారణం

తెనాలి, సెప్టెంబర్ 9, (ఆంధ్ర జ్యోతి): వైసీపీ ప్రభుత్వ కాలంలోని ఐదేళ్లలో ఒక్క కాల్వ పై ఒక్క పనికూడా చేయకపోవటం, డ్రెయిన్‌ల దుస్థితిని వరద నీటికి వదిలేయటంతో నేడు విపత్తు కొంప ముంచుతోంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.73 లక్షల ఎకరాల్లో ఏటా ఖరీఫ్ వరి సాగవుతోంది. ఇదంతా బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోనే ఉంది. ఈ మూడు జిల్లాల పరిధిలో ఒక ప్రాంతంలో వర్షాభావం వస్తే, మరో ప్రాంతంలో వర్షాలు పడటం, పంటకు నీటి కష్టాలు లేకుండా ఉండటం ఇప్పటి వరకు చూస్తూ వచ్చాం. కానీ ఈ ఖరీఫ్ సీజన్‌లో మాత్రం మూడు జిల్లాల్లో ఒకే పరిస్థితి. ఒక్క ఎకరాకూడా బయట లేకుండా నీటిలో మునిగి పంటదిగుబడిపై ప్రభావం చూపే పరిస్థితి ఏ ర్పడింది. ఇప్పుడు ఇ దే రైతన్నను కలవరపాటుకు గరిచేస్తోంది.

- ఓ అండ్‌ఎం పనులే దిక్కు... అవీ చేసేందుకు ముందుకు రాక
- సీజన్ ముందు భారీ కేటాయింపులు
- సకాలంలో గత ప్రభుత్వం ఒక్కపైసా విదిల్చిందిలేదు..
- పనులు చేసి కోర్టు మెట్లెక్కితేనే కాంట్రాక్టర్‌లకు డబ్బు
- గత ప్రభుత్వం చేసిన పాపం ఇప్పుడు శాపంగా మారి..

ఓ అండ్ ఎం కింద భారీగా మంజూరు చేశామనిపించి...

ఏటా ఖరీఫ్ సీజన్ వస్తుం దంటే డెల్టా కాల్వల మరమ్మతు లు, డ్రెయిన్‌ల పూడికతీత వంటివి చేపట్టటం ఆనవాయితీ. నీటిపారుదల శాఖ ఆ మూడు నెలలు టెండర్లు పిలవ టం దగ్గర నుంచి పనులు పూర్తయ్యేవరకు వి శ్రాంతి లేకుండా గడిపేవారు. అయితే గత వైసీపీ సర్కారు వచ్చాక కాల్వలకు నీరు లేకున్నా పర్వాలేదు. జగనన్న అడుగుపెడితే చాలు చేలన్నీ పచ్చబడిపోతాయన్న చందంగా ఊదరగొట్టిన ప్రభుత్వ పెద్దలు, పనులు చేసే విషయాన్ని పక్కన పెట్టేశారు. అయితే అసలు చేయలేదనిపించుకోకుండా ఉండటానికి ఖరీఫ్ సీజన్‌కు ముందు ఓ అండ్ ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) పనులకు నిధులు భారీగా మంజూరు చేశామని గొప్పలుచెప్పి వదిలేసిన పరిస్థితి. అయితే ఏ సీజన్‌లోనూ పూర్తిస్థాయిలో కాదు కదా! కనీసం సగం నిధులుకూడా ఖర్చు చేసిన పాపానపోలేదు. 2020-21లో రూ. 14.5 కోట్లు, 2021-22 ఖరీఫ్ సీజన్‌కు రూ. 17కోట్లు, 2022-23 సీజన్‌కు రూ. 21కోట్లు, 2023-24 సీజన్‌కు రూ. 22 కోట్లు, 2024-25కు రూ. 13.62 కోట్లు మంజూరు చేశామనిపించారు. అయితే వీటిలో ఏ ఒక్క సంవత్సరం నిధులు పూర్తిగా ఖర్చు చేసిందేలేదు. సాధారణంగా కాల్వలు, డ్రెయిన్‌లలో పూడిక తీత, గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించటం, కట్టలు దెబ్బతిని ఉంటే, వాటిని పటిష్ట పరచటం, గండ్లుపడే ప్రమాదం ఉంటే వాటిని పూడ్చటం, షట్టర్‌లు, స్ట్రక్చర్స్ దెబ్బతింటే వాటి మరమ్మతులు చేయటం పరిపాటి. వీటికోసం ప్రత్యేకంగా చేసేది ఉండదు. డెల్టా కాల్వల వ్యవస్థ ఏర్పడిన తర్వాత కాలం నుంచి వస్తున్న తంతే. గత వైసీపీ సర్కారు మాత్రం వీటిని కేవలం వారి ఆదాయ వనరుగానే చూసుకున్నారు. తూటికాడ తొలగింపు పనులు మాత్రం చేశామనిపించి కార్యకర్తల జేబుల్లోకి దోచిపెట్టారు. రైతులకు మాత్రం కన్నీరు మిగిల్చారు.

రైతుల నుంచి వసూలు చేసిన నీటి తీరువా ఖర్చు చేయలేదు

గడచిన ఐదేళ్ల లో ఒక్క కాల్వ కట్టపై పిడికెడు మట్టిపోసిన పా పాన పోలేదు. కాల్వల చివరి భూములకు నీరందకున్నా పూడిక తీసిన దిక్కులేదు. మురుగు కాల్వల పరిస్థితి అయితే మరీ దారుణం. ఒక్క డ్రెయి న్ మరమ్మతులు చేసినవారే లేరు. ఒకవేళ చిన్నాచితక పనులు చేసినా గత వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే. ఆ సంవత్సరం పనులు చేసిన కాంట్రాక్టర్‌లకు రూపాయికూడా ఇవ్వకపోవటంతో తర్వాతి నాలుగేళ్ల పనులు చేయటానికి అసలు ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదంటే అతిశయోక్తి కాదు. పైగా చేసిన పనులకో సం కోర్టులను ఆశ్రయించాల్సిన దుస్థితి. ఒక్క మాటలో చెప్పాలంటే రైతుల నుంచి నీటి తీరువా రూపంలో వసూలు చేసే మొత్తాన్ని కూడా వారికోసం ఖర్చు చేయలేదంటే దీనికిమించిన దారుణం మరోటి ఉండ దేమో! సాధారణంగా ఎకరాకు రూ. 200 చొప్పున నీటి తీరువా ఏటా వసూలు చేస్తారు. డెల్టా కాల్వల పరిధిలో 5.73 లక్షల ఎకరాల భూమి ఉంటే, ఎకరాకు రూ. 200 చొప్పున రూ. 11.46 కోట్లు వసూలు చేసేవారు. అయితే ఈ మొత్తంలో సగంకూడా ఖర్చు చేసిందిలేదు. కనీసం ఆ మొత్తాలు ఖర్చు చేసి నా ఇంత దారుణ పరిస్థితి ఉండేది కాదు. అంటే ఈ ఐదేళ్లలో రూ. 60 కోట్ల వరకు నీటి తీరువా వచ్చినా ఒక్క సంవత్సరంలో కూడా ఆ నిధులు వెచ్చించిందిలేదనేది అధికారుల మాటే. కొత్తగా నిధులు ఇవ్వకున్నా, రైతులకోసం వారి దగ్గర నుంచి వసూలు చేసిన నిధులనుకూడా ఖర్చు చేయకపోవటం చేతకానితనమే. అయితే వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తొలి సం వత్సరంలో కాంట్రాక్టర్‌లు పనులు చేసేందుకు ఉత్సా హం చూపించారు. అయితే ఆ సంవత్సరం పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధులు మాత్రం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో అధికారులు, ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతూనే వచ్చారు. కొంతమంది చేసేదిలేక కోర్టును ఆశ్రయిస్తే, చివరకు ఒకరిద్దరికి మాత్రం ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. మిగిలినవారు నేటికీ డబ్బు కోసం ఎదురు చూస్తుంటే, తర్వాత డబ్బు చేతికందినవారుకూడా పనుల చేయటానికి తర్వాత నాలుగు సంవత్సరాలు ఆసక్తి చూపలేదు. దీంతో వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. చిన్నచిన్న పనులు చేశామనిపించి ఉన్న నిధులు దోచుకుతిన్నారు. ఈ పాపమే నేడు రైతులకు శాపంగా మారిం ది. ప్రధానంగా తుంగభద్ర డ్రెయిన్, రేపల్లె, బీఎం డ్రెయిన్‌లు, జంపని డ్రెయిన్‌ల వంటివాటి వెంటున్న పొలాలు మొత్తం నీటిలో మునిగిపోయి ఉన్నాయి. ఇవి ఎప్పుడు బయటపడతాయో! అసలు పంట చేతికి అందుతుందో! లేదో కూడా రైతులకు అంతుబట్టని విషయంగా మారింది.



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం

పెరిగిన మిర్చి కొనుగోళ్లు

- ధర పెరుగుదలపై రైతుల ఆశలు
- గత వారంలో రూ.3 వేల వరకు పెరుగుదల
- ఇతర రాష్ట్రాల్లో దెబ్బతిన్న పంటలు
- బంగ్లాదేశ్‌లో అల్లర్లు... చైనాలో తుఫానుతో అక్కడ కూడా నష్టం
- ఎగుమతులకు డిమాండ్ పెరిగే అవకాశం
- గుంటూరు జిల్లాలోనే 70 లక్షల టిక్కీల నిల్వ

గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పెరు గుదలపై రైతాంగం పెట్టుకొన్న ఆశలు చిగురిస్తున్నాయి. ఎండు మిరపకాయలు ఎగుమతి జరిగే దేశాలు, రాష్ట్రాల్లో ఈ ఏడాది వేసిన పంట 50 శాతం పైగా వివిధ కారణాలతో దెబ్బతినడంతో అందరి చూపు గుంటూరులోని శీతల గిడ్డం గుల్లో నిల్వ ఉన్న మిర్చిపై పడింది. గత వారం నుంచి కొను గోళ్లు పెరిగాయి. ధర కూడా క్వింటాల్‌కు రూ. 3 వేల వరకు పెరిగినట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మిర్చి రేటు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరూ తొందరపడి తక్కువ ధరకు మిర్చిని అమ్ముకోవద్దని రైతులకు సూచిస్తున్నారు.

గత ఏడాది మిర్చి విస్తీర్ణం పెరగడం, చైనా, బంగ్లాదేశ్‌లకు ఎగుమతులు నిలిచిపోవడంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధర పతనం అయింది. దాదాపుగా సగా నికి సగం పడిపోయింది. ఒకానొక దశలో తేజ వెరైటీ మిర్చి క్వింటాల్‌కు రూ. 28 వేల వరకు ధర లభించగా వారం క్రితం వరకు రూ. 15 వేల వరకు మాత్రమే ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచే ధర తగ్గడంతో రైతులు చాలామంది గుంటూరు పరిసరాల్లోని 99 కోల్డ్‌స్టోరేజ్‌లలో సరుకు నిల్వ చేశారు. దీంతో గత జూన్ నెల రెండో వారంలో ఆయా స్టోరేజ్‌లలో దాదాపుగా 90 లక్షల మిర్చి టిక్కీల నిల్వలున్నా యి. ఈ కారణంగా ధర ఏమాత్రం పెరగకుండా స్థిరంగా కొనసాగుతూ వస్తున్నది. జూన్, జూలై, ఆగస్టు నెలలు కలిపి దాదాపుగా 20 లక్షల మిర్చి టిక్కీల వరకు రైతులు విక్రయించేశారు. ఇంకా 70 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నాయని మార్కెటింగ్ శాఖ అధికారవర్గాలు సమాచారాన్ని సేకరించాయి.



గుజరాత్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వలన మిరప పైరుకు సుమారు 50 నుంచి 60 శాతం నష్టం చేకూరిందని అక్కడి ట్రేడ్ వర్గాల ద్వారా గుంటూరు ఏఎంసీలోని ఎక్స్‌పోర్టర్లకు సమా చారం అందింది. అలానే మహారాష్ట్రలో అధిక వర్షాల వలన మిరప పంట వైరస్ బారిన పడింది. రానున్న రోజుల్లో వర్షాల కారణంగా ఎలాంటి పరిస్థితులు ఉంటాయో తెలియని పరిస్థితి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పచ్చి మిర్చికి గిరాకీ నెలకొనడంతో అక్కడ కోతలు జోరందుకున్నా యి. రానున్న రోజుల్లో అధిక వర్షాల వలన మొక్కలు దెబ్బ తింటాయన్న భయాందోళన నడుమ పచ్చిమిర్చి కోతలు మరింతగా పెరిగాయి. మధ్యప్రదేశ్ మిర్చి పండించే ప్రాంతా ల్లో వర్షాల కారణంగా సుమారు 15 నుంచి 20 శాతం వైరస్ సమస్యలు మొదలయ్యాయని సమాచారం. భారత దేశంలో అత్యధికంగా మిరప సాగు చేసే రెండు తెలుగు రాష్ట్రాల్లో మిర్చి ధరలు పడిపోయిన కారణంగా ఈ సంవత్సరం 50% సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. గత వారంలో కురిసిన వర్షాలతో నారు అత్యధికంగా దెబ్బతిన్నది. మళ్లీ మిర్చి నారు వేయాల్సిన పరిస్థితి వలన కొత్త పంట రావడానికి డిసెంబరు నెల కావొచ్చు. తెలుగు రాష్ట్రాలలో వాతావరణ శాఖ నివేదికల ప్రకారం అధిక వర్షాల కారణంగా మిరప పంట దిగుబడి కచ్చితంగా తగ్గుతుంది. చైనాలో భిన్న వాతావరణ పరిస్థితుల వలన పంట తొలి దశలో నీరు లేక ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పుడు అధిక వర్షాల కారణంగా కోతల సమయంలో మరిన్ని సమస్యలు తలెత్తాయని సమాచారం అందింది. దీని మూలాన జూలై నెలలో చైనాలో పండే మిరపకు సుమారు 5000 వరకు మిరప రేటు పెరగడం జరిగింది. చైనాలో ఈ వారంలో అతి భయంకరమైన యాగి తుఫాను వలన మిర్చి పంట ధ్వంసమైంది.

ప్రతిరోజు ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు లక్ష బస్తాలు, తెలంగాణలో 50,000, కర్ణాటకలో 25000 మిరప బస్తాలు అమ్మకం మొత్తంగా 1,75,000 బస్తాలు రోజుకు అమ్మకాలు కొనసాగుతున్న నడుమ కొత్త పంట చేతికి వచ్చే సమయం ఆలస్యం అవుతున్నందున ఇప్పుడున్నటువంటి నిల్వలు సరిపోతాయా లేదా అనే అనిశ్చితి ట్రేడ్‌లో నెలకొంటున్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే మిరప నిల్వలు ఉన్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికలు మూలంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలలో అధిక వర్షాల వలన మిరప పంటకు ప్రతికూల పరిస్థితులు తలెత్తడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నిల్వ వున్న మిర్చికి విపరీత మైన డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత వారంలో క్వింటాల్ తేజ వెరైటీ మిర్చి రూ. 15 వేల నుంచి రూ. 18 వేలకు పెరిగింది. ఇతర వెరైటీల్లోనూ క్వింటాల్‌కు రూ. 2 వేల వరకు పెరిగినట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. దీని దృష్ట్యా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసుకొన్న రైతులు పంటని విక్రయించే విషయంలో ఆచితూచి అడుగులు వేయడం మంచిదని గుంటూ రు ఏఎంసీకి చెం దిన దిగుమతి వ్యాపారి కర్ల పూడి వెంకటే శ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

రూ.10 కోట్లు హాంఫట్!

- మెప్మాలో బోగస్ గ్రూపులతో బురిడీ
- ఫొటోలు ఉన్నా.. మనుషులు లేరు
- పరిధి దాటి మరీ రుణాలు మంజూరు చేసిన బ్యాంకర్
- విచారణ మధ్యలో అధికారి బదిలీ



గుంటూరు సిటీ, సెప్టెంబరు 9 : గుంటూరు మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) లో మరో అవినీతి బాగోతం వెలుగు చూసింది. మెప్మా సిబ్బంది కొందరు బోగస్ గ్రూపులను సృష్టించి బ్యాంకును బురిడీ కొట్టించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై విచారణ జరుగుతుంది. సంగడిగుంట ప్రాంతానికి చెందిన డ్వాక్రా సంఘాలకు లాంచెస్టర్ రోడ్డులో ఉన్న బ్యాంకులో రుణాలు ఇస్తున్నా రు. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న సిబ్బంది కొన్ని బోగస్ గ్రూపులను ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫొటోలు ఉన్నా మనుషులు లేకుండా ఈ గ్రూపులు ఏర్పాటు అయ్యాయి. వారి పరిధి కానప్పటికీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం, చౌడవరం ప్రాంతంలో కూడా గ్రూ పులు ఉన్నట్లు చూపించారు. ఒక్కో గ్రూపునకు రూ.20 లక్షలు చొప్పున రుణాలు మంజూరు చేయించారు. సుమారు 60 వరకు ఈ తరహా బోగస్ గ్రూపులు ఏర్పాటు కాగా, రూ.10 కోట్ల వరకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి నట్లు తెలుస్తోంది. బ్యాంకు మేనేజర్ పరిధి దాటి రుణాలు మంజూరు చేసినట్లు తెలిసింది. తీసుకున్న రుణాలు రికవరీ క్రమంలో మొత్తం బోగస్ గ్రూపుల సంగతి వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో మెప్మాలోని ఉన్నతాధికారులు, ఆ ప్రాంతంలోని కమ్యూ నిటీ ఆర్గనైజర్లు, సిటీ మిషన్ మేనేజర్లపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే విచారణ ప్రారంభించిన మెప్మా అధికారులు 15 బోగస్ సంఘాలను గుర్తించారు. ఇంతలో విచారణ అధికారి బదిలీ కావటంతో విచారణను మధ్యలో నిలిపివేశారు. మరింత విచారణ జరిగితే మరిన్ని బోగస్ గ్రూపుల వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఏమి చేసినా.. ఏమి కాదన్న ధీమా

గత ఐదేళ్ల కాలంలో గుంటూరు మెప్మా కార్యాలయం అడ్డాగా అనేక అవినీతి, అక్రమాలు జరిగాయి. ఇక్కడ పనిచేసిన ఉన్నతాధికారి కనుసన్నల్లోనే ఇవి జరిగాయి. పేద మహిళలకు రుణాలు మంజూరు పేరుతో వందల కోట్ల రూపాయలు అక్రమాలు జరిగినా బాధ్యులపై సరైన చర్యలు లేవన్నది ప్రధాన ఆరోపణ. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని సస్పెన్షన్ చేసి మళ్లీ వెంటనే పోస్టింగ్ ఇస్తున్నారు. దాని వల్ల ఏమి చేసినా ఏమి కాదన్న ధీమా వారిలో కనిపిస్తుంది. అక్రమాలు జరిగినప్పుడు కూడా విచారణకు మెప్మా అధికారులనే పంపటం వల్ల అసలు విషయం పక్కదారి పడుతోంది. ఇకనైనా ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ట్రాఫిక్,మెకానిక్ స్పేర్ రైలు బోగీల కొరత

- ఏదైనా బోగీ పీవోహెచ్‌కు వెళ్తే ప్రయాణికులకు ఇబ్బందులే
- పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు ప్రస్తుతం సీ1 బోగీ కష్టాలు

మైనర్‌పై లైంగిక దాడి.. పాస్టర్‌కు 20 ఏళ్లు జైలు

6లో..

పంట నష్టం లెక్కింపునకు బృందాలు

- గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నియామకం
- 12వ తేదీ వరకు గడవు నిర్దేశించిన ప్రభుత్వం
- ఈ-పంట నమోదు జరగకపోయినా చేయమని ఆదేశాలు
- వరికి హెక్టారుకు రూ. 17 వేల ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చే అవకాశం

గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంట నష్టం లెక్కింపునకు అధికార యంత్రాంగం బృందాలను నియమించింది. వ్యవసాయ, ఉద్యానవన, పంచాయితీరాజ్, రెవెన్యూ అధికారులతో గ్రామానికి ఒక టీమ్‌ని ఏర్పాటు చేసింది. పర్యవేక్షణ నిమిత్తం మండల, డివిజన్ స్థాయి బృందాలను కూడా నియమించింది. అయితే ప్రస్తుతం వరదనీరు ఇంకా పొలాల్లోకి వస్తుండటంతో పంట నష్టం లెక్కించడం కష్టతరంగా మారింది. కొండవీడు, కొండ వాగులతో పాటు గుంటూరు ఛానల్‌లోకి అనేక చోట్ల డ్రైనేజీ నీరు వచ్చి చేరుతుండటంతో ఆ నీరంతా పంట పొలాల్లోకి చేరి నిలిచిపోతున్నది. నీరు తగ్గితే తప్పా పంట నష్టం లెక్కించలేని పరిస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన గడువు 12వ తేదీని పొడిగించాల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గత నెల 30, 31 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. వరి పంట 28 వేల హెక్టార్లు, ప్రత్తి 2,500 హెక్టార్లలో మునిగిపోయింది. ఎక్కువగా నం బూరు, కొలకలూరు, హాఫ్‌పేట, ఉప్పలపాడు, అను మర్లపూడి, తంగెళ్లమూడి, చేకూరు, వీఎన్ పాలెం, వెల్లలూరు, ములుకుదురు, మన్నవ, దొప్పలపూడి, నిడుబ్రోలు, వంగిపురం, వట్టిచెరుకూరు, ముట్లూరు, పొంగ్ర పాడు, కొల్లిమెర్ల, కొండపాటూరు, దంతలూరు, మంగళగిరి, రామచంద్రపాలెం దుగ్గిరాల, ఈమని, వీర్లపాలెం తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. వరి పంట అయితే ప్రస్తుతం పిలక దశలో ఉన్నది. పంట నీట మునగడం వలన దిగుబడి భారీగా తగ్గిపోయే పరిస్థితి ఉత్పన్నం అయింది. ఎకరాకు కనీసం 15 బస్తాల దిగుబడి తగ్గొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లో నీరు తగ్గిన తర్వాత ఉన్న పంటని కాపాడుకొనేందుకు రైతులు తక్షణంగా ఎకరాకు 25 నుంచి 30 కేజీల యూరియా, 10 నుంచి 15 కేజీల పొటాష్ వెదజల్లడంతో పాటు ఫార్ములా నెంబరు. 4 పిచికారి చేయాలని సూచించారు. అలానే పంటకు అవసరమైన సూక్ష్మపోషకాల గురించి స్థానిక వ్యవసాయాధికారుల ద్వారా తెలుసుకొని అందిస్తే నష్టాన్ని కొంతవరకు తగ్గించ వచ్చని తెలిపారు. తెగులు నివారణ మందు కూడా అర కేజీ వేయాలన్నారు. ఎవరూ కూడా మళ్లీ కొత్తగా పంట వేయొద్దని సూచించారు.



దెబ్బతిన్న వరి పైరు ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, అధికారులు (పాతచిత్రం)

కాగా పంట నష్టం లెక్కింపు జరిగిన తర్వాత ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల అవుతుంది. వరి అయితే హెక్టారుకు రూ. 17 వేల, ప్రత్తికి రూ. 17 వేలు, మొక్కజొన్నకు రూ. 12,500, సోయాబీన్, ఇతర అపరాలకు రూ. 10 వేలు, అరటికి రూ. 25 వేలు విడుదల చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఇంకా కొంత విస్తీర్ణంలో జరగాల్సి ఉన్నదని, అయినప్పటికీ లెక్కింపు జరగని పొలాల రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. తొలుత పంట నష్టం లెక్కించి ఆ తర్వాత ఈ-పంట నమోదులో చేర్చడం జరుగుతుందన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి : పాస్టర్‌కు శిక్ష

● 20 ఏళ్ల జైలు, రూ. లక్ష జరిమానా

గుంటూరు(లీగల్), సెప్టెంబరు 9: ప్రార్థనకు వచ్చిన 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమెను గర్భవతిని చేసినట్టు నేరం రుజువు కావడంతో వెంకటపాలెంలోని ఎస్సీ కాలనీలో పాస్టర్‌గా పనిచేస్తున్న నీలం కోటేశ్వరరావుకు 20 సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు ఇన్చార్జి న్యాయమూర్తి కె.నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నిందితుడు కోటేశ్వరరావు చుట్టుపక్కల గ్రామాల్లో పచ్చళ్లు, కొబ్బరినూనె అమ్ముతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పాస్టర్‌గా కూడా పని చేసేవాడు. తాను కొత్తగా నిర్మించుకున్న భవనంలో ప్రార్థనలు నిర్వహిస్తూ ఉండేవాడు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆ ప్రార్థనలకు వస్తూ ఉండేవారు. ఆ కాలనీలోనే ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలిక కూడా శని, ఆదివారాల్లో రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య ప్రార్థనలకు వచ్చి పాటలు పాడుతూ ఉండేది. నిందితుడు కోటేశ్వరరావును తాతయ్య అని పిలుస్తూ ఉండేది. ఈ క్రమంలో 2017 నవంబర్ 18న ప్రార్థనలు పూర్తికాగానే అందరూ వెళ్లిపోయారు. ఆ బాలిక మైక్ సెట్‌లతో పాటు కింద పరిచి ఉన్న దుప్పట్లను మడతపెట్టి సర్దుతూ ఒక్కటే ఉంది. నిందితుడు కోటేశ్వరరావు దీనిని ఆసరాగా తీసుకొని ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయంతో ఆమె ఈ ఘటనను తల్లిదండ్రులకు చెప్పలేదు. ప్రార్థనలకు వెళ్లడం మానేసింది. అయితే ప్రార్థనలకు వెళ్లమని తల్లి పదేపదే చెబుతుండటంతో మరో 10 రోజుల తర్వాత ఓసారి ప్రార్థనకు వెళ్లగా అప్పుడు కూడా కోటేశ్వరరావు ఆమెపై మరోసారి అఘాయిత్యానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకొని ఇంటికి చేరింది. నెలసరి రాకపోయినా రక్తహీనత వల్ల నెలసరి సక్రమంగా రాలేదని ఆమె తల్లి భావించింది. కొన్నాళ్లకు ఆ బాలిక తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతుండటంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె నాలుగో నెల గర్భవతి అని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు నిలదీయగా ఆమె తనపై నిందితుడు చేసిన అఘాయిత్యాన్ని చెప్పింది. డాక్టర్లు ఇచ్చిన సమాచారం మేరకు తుళ్లూరు పోలీసులు విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఆ బాలిక వద్ద స్టేట్మెంట్ నమోదు చేసి నిందితుడు కోటేశ్వరరావుపై అత్యాచార నేరంపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎన్ఏ టెస్ట్‌లోనూ ఆ బాలిక గర్భవతి కావటానికి కోటేశ్వరరావు కారణం అని తేలింది. అప్పటి తుళ్లూరు సీఐ సీహెచ్ రవిబాబు ఈ కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఏపీపీ కె.శ్యామల కోర్టులో ప్రాసిక్యూషన్ నిర్వహించారు. విచారణ అనంతరం నిందితుడు కోటేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

విజ్ఞాన్‌లో చదువుతోపాటు నైపుణ్యాలు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 9: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీని సోమవారం జింబాబ్వే ప్రభుత్వ ప్రతినిధులు అలాగే న్యూఢిల్లీ నుంచి ఎంబసీ ప్రతినిధులు సందర్శించారని వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి. నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇండియాలోని జింబాబ్వే ప్రతినిధి మాట్లాడుతూ గతేడాది 45 మంది విద్యార్థులను జింబాబ్వే ప్రభుత్వం విజ్ఞాన్ యూనివర్సిటీలో వేర్వేరు ఇంజినీరింగ్ కోర్సులు చదవడానికి పంపించామన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా 107 మంది విద్యార్థులను వేర్వేరు కోర్సుల కోసం ఇక్కడికి పంపించినట్లు తెలిపారు. ముఖ్యంగా అగ్రికల్చర్ బీఎస్సీకి ప్రాధాన్యతనిస్తూ జింబాబ్వే ప్రభుత్వం ఎక్కువ మంది విద్యార్థులను ఈ కోర్సుకి ఎంపిక చేసినట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులను పంపించడానికి గల కారణాలు వివరిస్తూ విజ్ఞాన్ యూనివర్సిటీలో చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ పి.నాగభూషణం, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, సీఈవో నందిగామ శ్రీకాంత్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వర్సిటీలో జింబాబ్వే ప్రతినిధులు

ట్రాఫిక్, మెకానిక్ స్పేర్ రైలు బోగీల కొరత



● ఏదైనా బోగీ పీవోహెచ్‌కు వెళ్తే ప్రయాణికులకు ఇబ్బందులే

● పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు ప్రస్తుతం సీ1 బోగీ కష్టాలు

గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్, మెకానిక్ స్పేర్ రైలు బోగీల కొరత గుంటూరు రైల్వే డివిజన్‌ని పట్టి పీడిస్తుంది. ముఖ్యంగా ఏసీ చైర్‌కార్, త్రీటైర్, టూటైర్ బోగీల స్పేర్స్ ఒక్కటి కూడా డివిజన్ వద్ద అందుబాటులో లేవు. దీంతో ఏదైనా రైలుకు సంబంధించిన బోగి పీరియాడికల్ ఓవర్ హాలింగ్ (పీవోహెచ్)కు వెళ్తే ఇక అది తిరిగొచ్చేవరకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏసీ బోగీలో వెళదామని అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకొన్న ప్రయాణికులకు రైల్వే అధికారులు ప్రత్యామ్నాయంగా సెకండ్ సిట్టింగ్‌లో సీట్లు కేటాయిస్తున్నారు. కొంతమంది గత్యంతరం లేని పరిస్థితుల్లో రైల్వే చూపించిన ప్రత్యామ్నాయ బోగీలో ప్రయాణిస్తుండగా చాలామంది రద్దు చేసుకొంటున్నారు.

ఏసీ చైర్‌కార్ కష్టాలు

రైలు బోగీల మెయిన్‌టెనెన్స్ కోసం విడతల వారీగా రేణిగుంటలో ఉన్న ఓవర్ హాలింగ్ డిపోకి పంపుతారు. ఒకసారి పీవోహెచ్ జరిగిన తర్వాత మళ్లీ ఎప్పుడు చేస్తారనేది కూడా ముందుగానే తేదీని నిర్ణయిస్తారు. ఆ ప్రకారం రైల్వే శాఖ ప్రత్యామ్నాయం చూసుకోవాలి. అయితే డివిజన్ వద్ద ఎలాంటి స్పేర్ ఏసీ బోగీలు లేకపోవడంతో గత కొన్ని రోజుల నుంచి పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు ఏసీ చైర్‌కార్ కష్టాలు వెంటాడుతోన్నాయి. పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు రేక్ రేషింగ్‌తో కూడుకొని ఉంటాయి. ఒక రోజు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌గా నడిపితే దానినే తర్వాత రోజు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌గా మార్పు చేసి నడుపుతారు. ఈ రెండు రైళ్లకు ఒక ఏసీ చైర్‌కార్ బోగీ ఉంది. అది వారం క్రితం పీరియాడికల్ ఓవర్ హాలింగ్ నిమిత్తం రేణిగుంట షెడ్డుకు వెళ్లింది. అక్కడి నుంచి ఎప్పటికి తిరిగొస్తుందో తెలియని పరిస్థితి.

స్పేర్ మంజూరు చేయాలి

రైల్వేలో సాధారణంగా ఇలా పీవోహెచ్‌కు ఏదైనా బోగీని పంపితే దానికి ప్రత్యామ్నాయంగా వేరొకటి ఏర్పాటు చేస్తారు. దీనినే మెకానికల్ స్పేర్ అంటారు. కొన్ని సందర్భాల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే అదనంగా మరో బోగీ ఏర్పాటు చేస్తారు. దానిని ట్రాఫిక్ స్పేర్‌గా పరిగణిస్తారు. ఈ రెండు స్పేర్‌లు ప్రస్తుతం డివిజన్ వద్ద అందుబాటులో లేవు. పీవోహెచ్‌కు పంపిన ఏసీ చైర్‌కార్ బదులు ఏసీ త్రీటైర్ అయినా ఏర్పాటు చేయాలి. ఒకవేళ ఏమైనా ఛార్జీలో వ్యత్యాసం ఉంటే దానిని ప్రయాణికుల వద్ద వసూలు చేయవచ్చు. కాగా ప్రస్తుతం పల్నాడు, సింహాద్రి రైళ్లకు రెండు రోజులకు ఒకసారి ఏసీ చైర్‌కార్ లేదని, దానికి ప్రత్యామ్నాయంగా సెకండ్ సిట్టింగ్ డీఈ1 బోగీ ఏర్పాటు చేశామని ప్రయాణికుల ఫోన్లకు సందేశాలు వస్తున్నాయి. ఏసీ చైర్‌కార్ కంటే సెకండ్ సిట్టింగ్ ఛార్జీ తక్కువ కావడంతో ఆ మొత్తాన్ని రీఫండ్ కోరవచ్చని సలహా ఇస్తున్నారు. ఇది తతంగంతో కూడుకున్నది. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులు, ఎంపీలు సమస్యని రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లి డివిజన్‌కి కనీసం ఒక ఏసీ చైర్‌కార్, మరో ఏసీ త్రీటైర్, టూటైర్ బోగీలను స్పేర్‌గా మంజూరు చేయించాల్సిన అవసరం ఉన్నది.

నిశ్చింతగా ఉన్నామంటే సైనికుల త్యాగాల ఫలితమే



ఆర్మీ సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● టెరిటోరియల్ ఆర్మీ సేవలకు 75 వసంతాలు పూర్తి

● వినుకొండ పట్టణంలో జవాన్ల సైకిల్ యాత్ర

వినుకొండ, సెప్టెంబరు 9: సరిహద్దుల్లో లక్షల మంది సైనికుల త్యాగాల ఫలితంగానే దేశంలో ప్రజలంతా గుండెలపై చెయ్యి వేసుకుని నిశ్చింతగా ఉండగలుగుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అందుకే జైజవాన్ అంటూ నినదిస్తూ వారికి అత్యున్నత గౌరవం ఇస్తున్న దేశం కూడా మనదే అంటూ సైన్యం సేవలను ఆయన ఘనంగా కొనియాడారు. దేశంలో టెరిటోరియల్ ఆర్మీ సేవలకు 75 వసంతాలైన సందర్భంగా 30 మంది జవాన్లతో కశ్మీర్ సియాచిన్‌లోని గ్లేసియర్ బేస్ క్యాంప్ నుంచి మొదలై అండమాన్ నికోబార్ దీవుల్లోని ఇందిరా పాయింట్ వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర ఆదివారం వినుకొండకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో వినుకొండలో జవాన్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కారంపూడి రోడ్డులోని ఎన్ఎస్పీ కాలవ వద్ద జవాన్ల సైకిల్ యాత్రను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సోమవారం జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈయాత్రలో పాల్గొన్న జవాన్లు ఎమ్మెల్యే ఆంజనేయులు దంపతులను అభినందించారు. బస్టాండ్ సెంటర్ నుంచి స్తూపం మీదుగా లయోల పాఠశాల వరకు ర్యాలీ సాగింది. జవాన్లతోపాటు సైకిల్ తొక్కిన జీవీ వారిని ఉత్సాహ పర్చారు. పట్టణంలో సాగిన యాత్రలో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, పట్టణ ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. యాత్రలో భాగంగా బృంద సభ్యులు లయోల పాఠశాల్లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. యాత్ర మార్గమధ్యలో వివిధ ప్రాంతాల్లో సుమారు 40 వేల మందికిపైగా మాజీ సైనిక ఉద్యోగులు, వీరసైనికుల సతీమణిలతోపాటు వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 75వ వజ్రోత్సవానికి చేరువైన టెరిటోరియల్ సైన్యానికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నట్లు తెలిపారు. శత్రుదేశాలు, ఉగ్రవాదుల నుంచి దేశాన్ని కాపాడుతున్న సైనిక సేవలను మరిచిపోలేమన్నారు. 1949లో ప్రారంభమై నేటి వరకు ప్రతి ఆపద కాలంలో దేశానికి టెరిటోరియల్ ఆర్గనైజింగ్ సేవలు వెలకట్టలేనివని తెలిపారు. మక్కెన మాట్లాడుతూ ఆర్మీ దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ యాత్ర వినుకొండకు రావడం సంతోషం అన్నారు. ఆంజనేయులు చేతుల మీదుగా యాత్రను చేపట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఆర్మీ జవాన్లు మాజ్‌రావత్, అభిజిత్ తోపాటు 46 మంది జవాన్లు, ఎంఈవో జఫ్రూల్లాఖాన్, జనసేన నాయకులు నాగశ్రీను, మాజీ ఆర్మీ జవాన్ బొల్లాపల్లి వెంకట్రావు, గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ లక్షణ్ కిషోర్, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్, పఠాన్ ఆయుబ్ ఖాన్, లగడపాటి వెంకట్రావు, పెమ్మసాని నాగేశ్వరరావు, వాసిరెడ్డి లింగమూర్తి, రోడ్డా వీరాంజనేయరెడ్డి, సౌదాగర్ జానీ బాష, మస్తాన్‌రావు, యర్రమాస్ కోటేశ్వరరావు, ప్రైవేట్ విద్యాసంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రలోభ పెట్టారు.. భయ పెట్టారు

● ఇన్చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన జబీన్



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న షేక్ జబీన్

దుగ్గిరాల, సెప్టెంబరు 9: 'తెదేపా ఎంపీటీసీ సభ్యులను భయపెట్టారు.. కేసులు పెట్టారు.. ప్రలోభ పెట్టారు.. నాకు బీసీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా వేధించారు.. అధైర్యపడకుండా ధర్మం గెలుస్తుందన్న నమ్మకంతో ఉన్నాను' అని ఇన్చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన షేక్ జబీన్ తెలిపారు. దుగ్గిరాల మండల ఇన్చార్జి ఎంపీపీగా చిలువూరు ఎంపీటీసీ మెంబర్ షేక్ జబీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు తెదేపా, జనసేన నాయకులు జబీన్‌ను సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించారు. రెండున్నరేళ్ల క్రితం జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో మెజార్టీ సభ్యులు తొమ్మిది మందితో ఎంపీపీ పీఠం తెదేపా దక్కించుకోవాల్సి ఉంది. రాజకీయ కారణాల నేపథ్యంలో అధికారులు పోటీలో ఉన్న ఎంపీపీ అభ్యర్థికి బీసీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా, వైసీపీ సభ్యురాలికి ఎంపీపీ కట్టబెట్టిన విషయం విదితమే. కాగా ఇటీవల ఎంపీపీ రాజీనామా చేయడంతో ఇన్చార్జి ఎంపీపీగా జబీన్‌ను ప్రకటిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. బాధ్యతల స్వీకరణ అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీటీసీ మెంబర్ తాళ్ల అశోక్ అధ్యక్షత జరిగిన అభినందన కార్యక్రమంలో జబీన్ మాట్లాడుతూ బీసీ సర్టిఫికెట్ ఇవ్వకుండా తనను వేధించారని, తహసీల్దార్, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేశామని, హైకోర్టు తీర్పును కూడా గౌరవించకుండా తనకు ఎంపీపీ పీఠం దక్కకుండా చేశారన్నారు. తాను అధైర్యపడకుండా అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్, పోతినేని శ్రీనివాస్, శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. ఎంపీపీ ఎన్నికల సమయంలో వైసీపీ చేసిన మోసాలను గుర్తు చేశారు. చిలువూరు-2 ఎంపీటీసీ మెంబర్ రోజమరియమ్మ మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా అందరం ఒకేమాటకు కట్టుబడి ఐక్యంగా నిలిచామన్నారు. ఈమని ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్య మాట్లాడుతూ తన భర్త శ్రీనివాసరావుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి, ఇంటికి పోలీసులను పంపి వేధింపులకు గురిచేయడంతో రెండు నెలలు అజ్ఞాతంలో గడపాల్సి వచ్చిందన్నారు. పేరుకలపూడి ఎంపీటీసీ మెంబర్ తాళ్ల అశోక్ మాట్లాడుతూ ఎంపీటీసీగా గెలిచిన నాటి నుంచి పలురకాలుగా వేధిస్తూ వచ్చారని, పార్టీలో చేరకుంటే చంపుతామని కూడా బెదిరించారన్నారు. ఎంపీటీసీ సభ్యులు పుతుంబాక సాయికృష్ణ, విశ్వనాథపల్లి శివకుమార్, మరీదు రాము, కొప్పుల మధుబాబు, గ్యారా నిర్మల, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, జలాలుద్దీన్, నిజాముద్దీన్, సాదిక్, కో-ఆప్షన్‌సభ్యుడు వహీదుల్లా, తోటకూర సీతారామయ్య, యడ్ల సాయికృష్ణ, నర్రా శ్రీనివాసరావు, యడ్ల రామారావు, పాటిబండ్ల కృష్ణప్రసాద్, తాడిబోయిన రామకృష్ణ, నందిపాటి జోగారావు, కొరిటాల సురేష్, యేమినేని కోటేశ్వరరావు, పలువురు జబీన్‌ను అభినందించారు.

వరద బాధితులను కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలి



ప్రసంగిస్తున్న నీటిపారుదల రంగ నిపుణులు లక్ష్మీనారాయణ

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 9 : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో వరద బాధితులను ఆదుకోవాలని నీటిపారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ అన్నారు. జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరులో బుడమేరు నేర్పిన గుణపాఠాలపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ, బుడమేరు వరదలు ప్రజలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అపార నష్టం కలిగించాయని అన్నారు. ఇలాంటి ఉపద్రవం భవిష్యత్తులో జరగకుండా బుడమేరు సహజ ప్రవాహ మార్గాన్ని కొల్లేరు సరస్సు వరకు సుగమం చెయ్యాలని అన్నారు. ఆక్రమణలను, కబ్జాలను తొలగించాలని, బుడమేరు డైవర్షన్ ఛానల్ ద్వారా కృష్ణానదికి 37,500 క్యూసెక్కుల ప్రతిపాదిత సామర్థ్యాన్ని యుద్ధ ప్రతిపాదికన అమలులోకి తీసుకుని రావాలని కోరారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వం అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, సినీ, వ్యాపార రంగ ప్రముఖులు ప్రదర్శిస్తున్న దాతృత్వాన్ని, మానవత్వాన్ని మరువలేమన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కృష్ణానది పరివాహక ప్రాంతం 45శాతం ఉండగా, బుడమేరు పరివాహక ప్రాంతం 48 శాతంగా ఉందన్నారు. ఇలాంటి బుడమేరును విస్మరించారన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద 11 లాకులు ఉంటే నాలుగు పనిచేయడం లేదని సరైన సిబ్బంది లేరని తెలిపారు. పులిచింతల దిగువ భాగంలో వైకుంఠపురం వద్ద 20 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తే మున్నేరు వరద నీటిని నిల్వ చేసుకోగలమన్నారు. వైకుంఠపురం రిజర్వాయర్ నుంచి నాగార్జునసాగర్ కుడి కాలువకు నీరు తరలిస్తే గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానానికి తోడ్పడుతుందన్నారు. శ్రీశైలంపై భాగాన కృష్ణా నదిపై సిద్దేశ్వరం ఆనకట్టను, కృష్ణా నదిలో కలిసే తుంగభద్రపై సుంకేసుల ఆనకట్టకు పై భాగాన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మిస్తే కరువు పీడిత ప్రాంతాలైన రాయలసీమకు నీరు అందించగలమన్నారు. ఈ చర్చా గోష్ఠిలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, రాజకీయ విశ్లేషకులు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

స్టాక్ మార్కెట్లపై అవగాహన పెంచుకోవాలి

పెదకాకాని, సెప్టెంబరు 9: మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పుల్లో భాగంగా మేనేజ్మెంట్, ఎంబీఏ, కామర్స్ విద్యార్థులు స్టాక్ మార్కెట్, సెక్యూరిటీ మార్కెట్, కమోడిటీ మార్కెట్లపై అవగాహన పెంచుకోవాలని విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ వ్యాపార అధ్యయన విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ ప్రత్యామ్నాయ పెట్టుబడులు అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఛాన్సలర్ గంగాధర్ రావు మాట్లాడారు. విభాగాధిపతి ఆచార్య వి.చంద్రశేఖరరావు మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్, వివృతి క్యాపిటల్ కంపెనీ సంయుక్తంగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు సెబి సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్, ట్రైనర్ జి.రాజశేఖర్ రెడ్డి నిర్వహిస్తారని పేర్కొన్నారు.

బుద్ధిజం విద్యార్థికి నివాళి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్ధిజం స్టడీస్ విభాగంలో ఎమ్‌ఏ మొదటి సెమిస్టర్ అభ్యసిస్తున్న మయన్మార్ దేశానికి చెందిన విద్యార్థి కొండన్న మృతికి యూనివర్సిటీ సంతాపం తెలిపింది.

8 మండలాల్లో తీవ్రంగా వరద

● ముమ్మరంగా సహాయక చర్యలు

● సబ్ కలెక్టర్ సంజన సిన్హా



తెనాలి అర్బన్, సెప్టెంబరు 9: తెనాలి డివిజన్‌లోని 8 మండలాల్లో వరద తీవ్రంగా ఉందనీ, ప్రకృతి విధ్వంసాన్ని ఎదుర్కొనేందుకు ముమ్మరంగా చర్యలు తీసుకున్నామని సబ్ కలెక్టర్ సంజన సిన్హా చెప్పారు. సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గత 9 రోజులుగా ఈ మండలాల్లో వరద ప్రభావం ఉందన్నారు. 2022 ఐఏఎస్ అభ్యర్థిగా శిక్షణ అనంతరం విధుల్లో చేరిన వెంటనే వరదల అనుభవం ఎదురైందన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో సర్వే చేసి నష్టపోయిన వారికి పరిహారం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కూడా వరద కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన తనకు రెండు రాష్ట్రాలలో పరిస్థితులపై అవగాహన ఉందని చెప్పారు. స్థానిక భాషలో ప్రజలతో మాట్లాడగలిగే సామర్థ్యం ఉందని, వారి సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

వరద బాధితులకు రూ. 5 లక్షలు విరాళం



సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేస్తున్న ప్రసాద్, శ్రీనివాసరావు, సాంబిరెడ్డి

తాడికొండ, సెప్టెంబరు 9: వరద బాధితులకు అండగా ఉండేందుకు బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ కంపెనీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు రూ. 5 లక్షల చెక్కును కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌బీవీఆర్ ప్రసాద్, రీజినల్ మేనేజర్స్ వడ్లమూడి శ్రీనివాసరావు, సాంబిరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా విజయవాడలోని పలు ప్రాంతాలు నీటమునిగి అపార ఆస్తి, ప్రాణనష్టం జరిగిందన్నారు. వరద బాధితులకు బాసటగా నిలిచేందుకు కంపెనీ రూ. 5 లక్షలు విరాళం ప్రకటించిందని తెలిపారు.

రేపు గుంటూరుకు మాజీ సీఎం జగన్

● సబ్ జైలులోనున్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు పరామర్శ

గుంటూరు, సెప్టెంబరు 9: గుంటూరుకు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం రానున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయి గుంటూరులోని సబ్‌జైలులో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు జగన్ వస్తున్నారు. ఈ మేరకు జగన్ పర్యటనను ఖరారు చేస్తూ ఆ పార్టీ నేతలకు సోమవారం సమాచారం అందించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేసి గుంటూరులోని సబ్‌జైలుకు తరలించిన విషయం తెలిసిందే. కాగా, ఇదే కేసులో ఉన్న పలువురు వైసీపీ నేతలను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

సంగం పశుదాణా పంపిణీ



సంగం దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే నక్క ఆనందబాబు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), సెప్టెంబరు 9: వరద బారిన పడిన రైతులను ఆదుకోవటానికి సంగం డెయిరీ ముందుకు రావటం హర్షణీయమని వేమూరి ఎమ్మెల్యే నక్క ఆనందబాబు అన్నారు. సంగం డెయిరీ వరద ముంపు గ్రామాల్లోని పాల రైతులకు ఆపన్న హస్తం అందజేసింది. పలు గ్రామాల్లో రైతులకు రూ.13.35 లక్షల విలువ కలిగిన పశు దాణాను చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు సంగం అధికారులు పంపిణీ చేశారు. జువ్వలపాలెంలో ఎమ్మెల్యే నక్క ఆనందబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఓలేరు బీఎంసీ పరిధిలో భట్టిప్రోలు మండలంలోని 11 గ్రామాల్లో 436 మంది పాడి రైతులకు, రేపల్లె మండలంలో రెండు గ్రామాల్లో 150 మంది పాడి రైతులకు, కొల్లూరు మండలంలోని 4 గ్రామాలకు 213 మంది రైతులకు, చల్లపల్లి మండలంలో 39 రైతులకు, జంపని బీఎంసీ పరిధిలో కొల్లూరు మండలంలో 10 గ్రామాల్లో 371 మంది పాడి రైతులకు, కొల్లిపర మండలంలోని పాతబొమ్మువారిపాలెం గ్రామంలో 29 మంది రైతులకు, ఉంగుటూరు బీఎంసీ పరిధిలో తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురం గ్రామంలో 42 మంది పాడి రైతులకు, అమరావతి మండలంలోని వైకుంఠపురం పెద్ద మొద్దూరు, చావపాడు గ్రామాల్లో 225 మంది పాడి రైతులకు మొత్తం 58 టన్నుల పశు దాణాను పాలకవర్గ సభ్యులు, అధికారులు పంపిణీ చేశారు. పాలకవర్గ సభ్యులు నర్ర వెంకట కృష్ణ ప్రసాద్, జ్ఞానానంద భగవాన్, వలివేటి ధర్మారావు, కంచర్ల శివరామయ్య, జీఎం కొల్లి వెంకటేశ్వర ప్రసాద్, మేనేజర్లు పాతూరి ఆదినారాయణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ నిధులు ఇవ్వటం హర్షణీయం



సర్పంచులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, సెప్టెంబరు 9: రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇబ్బంది పడిన నాలుగు వందల పంచాయతీలు ఉండగా పెదకూరపాడు నియోజకవర్గంలోని 40 గ్రామ పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిధులు ఇవ్వటం హర్షణీయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అమరావతిలో సోమవారం వరద ప్రభావిత పంచాయతీలకు పవన్ కల్యాణ్ రూ.40 లక్షల ఆర్థిక సాయం చెక్కులతో పాటు మరో పది గ్రామాలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మరో రూ.10 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. పవన్ కల్యాణ్ స్ఫూర్తితో నియోజకవర్గంలో నా వంతుగా దెబ్బతిన్న పది గ్రామాలకు రూ. 10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నానన్నారు. ప్రజలు తమ చేతనైన సహాయం చేయాలని, సొంత నిధులతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందనీ, సర్పంచులను జీరోలు చేస్తే కూటమి ప్రభుత్వం వారిని హీరోలను చేసిందని, గత ప్రభుత్వంలో పంచాయతీల్లో జరిగిన అవినీతిని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సాయం ఆలస్యమవుతుందనే ఉద్దేశంతోనే పంచాయతీల పారిశుధ్య పనులకు పవన్ కల్యాణ్ సొంత నిధులు కేటాయించారన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థకు వెయ్యి కోట్లు విడుదల చేసిన వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. ఎంపీపీ మేకల హనుమంతరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్, నేషనల్ పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాష్టి వీరాంజనేయులు, పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు యర్రంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00





విజయవాడలోని 62వ డివిజన్‌లో ఏర్పాటుచేసిన నీళ్ల మోటార్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, పక్కన జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

12 గంటల్లోగా పారిశుధ్య పనులు పూర్తి చేయండి

• రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 9 : విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు బెయిల్ అవుట్ ప్రాంతాల్లో 12 గంటల్లో మెగా పారిశుధ్య పనులు పూర్తి చేయాలని పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ కె.నారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పర్యవేక్షణలో ఉన్న 62వ డివిజన్ ఏపిఎస్ రోడ్ లోని లోతట్టు ప్రాంతాల్లో ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణారెడ్డి, ఇతర అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తొలుత డివిజన్‌లో ఎంత ప్రాంతం నీట మునిగింది, ఎన్ని ప్రాంతాల్లో ఎన్ని మోటార్లు ఏర్పాటు చేశారని, పారిశుధ్య పనుల పై గుంటూరు నగర కమిషనర్ ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ డివిజన్‌లో నీట మునిగిన ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీటిని త్వరితగతిన బెయిల్ అవుట్ చేయడానికి ఇప్పటికే 4 మోటర్లు ఏర్పాటు చేశారని, అదనంగా 40 హెచ్‌పి మోటార్లను తెప్పించాలన్నారు. నీటి బెయిల్ అవుట్ కి మోటర్ల వలన మెరుగైన ఫలితాలు వస్తున్నాయని, పర్యవేక్షణ అధికారులు వాటిపై దృష్టి సారించాలన్నారు. మంగళవారం సాయంత్రానికి నీటిని బెయిల్ అవుట్ చేయాలని, బెయిల్ అవుట్ జరగని ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 12 గంటల్లో పారిశుధ్య పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకోసం 3 షిఫ్ట్‌ల్లో 24 గంటలు పని జరుగుతునన‌ట్లు చెప్పారు. నీరు బెయిల్ అవుట్ అయ్యాక బురద ఉన్న రోడ్లు, ఇళ్ళను ఫైర్ ఇంజిన్ల ద్వారా శుభ్రం చేయించాలన్నారు. పర్యటనలో స్థానికులను సమస్యలపై వివరాలు అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు మౌలిక వసతుల ఏర్పాటు పై మంత్రి దృష్టికి తీసుకురాగా స్పందించిన నారాయణ.. వెంటనే తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందించాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలపై ఫిర్యాదుకు కాల్ సెంటర్

• నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 9 : విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస, సహాయ చర్యల కోసం గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్న కారణంగా గుంటూరు నగరంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో ఏ సమస్య తలెత్తినా నగర పాలక సంస్థ 24 గంటలు అందుబాటులో ఉండే కాల్ సెంటర్ కి ఫిర్యాదు చేయవచ్చని, మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై 0863-2345103, 104 నంబర్లకు కాల్ చేయడం లేదా 98499 08391 నంబర్ కి వాట్స్ అప్ చేయవచ్చని పేర్కొన్నారు. గుంటూరు నగరానికి త్రాగునీటి సరఫరా జరుగు ఉండవల్లి పంప్ హౌస్ కు కృష్ణానది నుండి నీరు సరఫరా జరుగుతుందని, ప్రస్తుతం వరదల వలన నది నీటిలో టర్బిడిటి (బురద సాంద్రత) అధికంగా ఉన్నందున, జీఎంసీ సరఫరా చేసే నీటిలో ఆలం, క్లోరిన్ తగు పాళ్ళల్లో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నగర ప్రజలు కూడా నగరపాలక సంస్థ సరఫరా చేసే తాగునీటిని విధిగా కాచి చల్లార్చి వినియోగించాలని కోరారు. ప్రజారోగ్య విభాగ అధికారులు అంటు వ్యాధులు ప్రబలకుండా చెత్త నిల్వ ఉన్న ప్రాంతాలు, వల్నరబుల్ పాయింట్స్ లో బ్లీచింగ్ చల్లించడం, క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు.



విజయవాడ 1వ వార్డులో వరదనీటిని తోడిస్తున్న ఎమ్మెల్యే నసీర్

నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఒకటో వార్డులో వరద కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని గుం టూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. వరదల కారణంగా ముంపు బారిన పడిన కుటుంబాలను సోమవారం ఆయన స్వయంగా కలిశారు. ఇంకా కొన్ని కాలనీలలోని రోడ్లు, ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉండడంతో పెద్ద మోటార్ ఇంజన్లను ఏర్పాటు చేసి నీరు తోడించే కార్యక్రమంలో పాల్గొన్నారు. నష్టాల అంచనా కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి కుటుంబ వివరాలను పొందుపరచాలని, అంటువ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బాధితులకు పాల ప్యాకెట్లు, పులిహోర ప్యాకెట్లు అందజేశారు. సహాయక చర్యల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంత రామ్ పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యల్లో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొన్నారు. మైలవరం నియోజకవర్గం గొల్లపూడి, జక్కంపూడి కాలనీలో సోమవారం ఆమె పాల్గొని బాధితుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో భాగమయ్యారు. వరద బాధితుల కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలపై వారు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆమె చెప్పారు. బాధితులకు అండగాప్రభుత్వం నిలబడుతోందని అన్నారు. ప్రభుత్వం చేప ట్టిన చర్యలతో ప్రజలు త్వరలోనే సాధారణ జీవితానికి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



విజయవాడ ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి

కన్యకా పరమేశ్వరి అమ్మవారి

దసరా నవరాత్రుల ఉత్సవ కమిటీ ఏర్పాటు

• జనరేటర్ కొనుగోలుకు ఎమ్మెల్యే నసీర్ రూ.50 వేల విరాళం

గుంటూరు, సెప్టెంబరు 9: స్థానిక ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహణ కోసం ఉత్సవ కమిటీ సిద్ధమైంది. ఒక ఛైర్మన్, నలుగురు కన్వీనర్లు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ముగ్గురు, 46 మంది సభ్యులతో మొత్తం 54 మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ తెలిపారు. దేవస్థానంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ప్రముఖులతో పాటు పెద్దలతో, పార్టీ నాయకులతో చర్చించి ఉత్సవాల నిర్వహణ కోసం కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. దసరా నవరాత్రుల ఉత్సవాలను గతంలో కంటే అత్యంత వైభవంగా నిర్వహించాలని అన్నారు. ఎమ్మెల్యే తన వంతుగా జనరేటర్ కొనుగోలుకు రూ. 50 వేల రూపాయలు విరాళంగా ప్రకటించారు. సమావేశంలో ఈవో దుర్గారావు, బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు వనమా నరేంద్ర, జనసేన పార్టీ నాయకుడు ఆనంద్ సాగర్, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, కొత్తూరు వెంకట్, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా వాహనదారులు

నిర్దేశిత ధరలే తీసుకోవాలి

• అధికారులు, వాహన యజమానులతో ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 9: జిల్లాలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను తరలించే రవాణా వాహనదారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్, వీసీ సమావేశ మందిరంలో ఇసుక రవాణా చేసే వాహనాలకు రాష్ట్ర మైనింగ్ శాఖ నిర్ణయించిన ధరలపై మైనింగ్, రవాణా శాఖ, జిల్లాలోని ఇసుక రవాణా చేసే వాహనదారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వాహనదారులు కిలో మీటరుకు ఒకే ధరను వసూలు చేసేందుకు రాష్ట్ర మైనింగ్ శాఖ ధరలు నిర్ణయించిందని, దీనిని అమలు చేసేందుకు జిల్లాలో ఇసుక రవాణా చేసే వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టరు, ఆరు, పది టైర్ల లారీకి కిలోమీటరు వారీగా టన్నుకు వసూలు చేసేందుకు నిర్ణయించిన ధరల వివరాలను ఈ సమావేశంలో వివ రించారు. ఆయిల్, నిర్వహణ ఛార్జీలు, డ్రైవర్, ఇతర ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాక్టరుకు (4.5 ఎమ్. టీ), ఆరు టైర్ల లారీ (10 ఎమ్. టీ), పది టైర్ల లారీ(18 ఎమ్ టీ)లకు కిలో మీటరుకు రూ.200 చొప్పున ఇస్తే గిట్టుబాటు అవుతుందని వాహన యాజమానులుకలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అభిప్రాయాలను రాష్ట్ర మైనింగ్ శాఖ అధికారులకు తెలియజేస్తామని వారికి కలెక్టర్ చెప్పారు. అదే విధంగా స్టాక్ యార్డుల వద్ద క్యూలైన్లు సక్రమంగా నిర్వహించటం, వాహనాలు మైనింగ్ శాఖ రిజిస్ట్రేషన్, నగరాల్లోని పగటి వేళ ఇసుక వాహనాల అనుమతి, వినియోగదారులతో ఇసుక అన్ లోడింగ్ సమయంలో ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ లోనే నగదు చెల్లింపులు తదితర అంశాలను అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్, ఆర్టీవో గోపాల్, జిల్లాలో ఇసుక రవాణా చేసే వాహనదారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పాల్గొన్న ఆర్టీవో, వాహన యజమానులు

24 గంటల్లో నష్టం అంచనాను లెక్కించాలి

గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన వచ్చిన వరదలతో ముంపునకు గురై నష్టపోయిన ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ 24 గంటలలో పూర్తిచేసి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఆర్‌డీవో, సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలతో వరద నష్టం అంచనాలు ప్రభుత్వం పంపిన నమూనలో ఏ విధంగా రూపొందించాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ప్రభుత్వం అందించిన పది ఫార్మాట్లలో సమాచారాన్ని పొందుపరచాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్యశాఖలు విడివిడిగా అంచనాలు అందజేయాలని, పట్టణాలు, మండలాలలో ఇళ్లు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న వాటిని వేరువేరుగా నమోదు చేయాలన్నారు. పక్కా ఇల్లు, రేకుల ఇల్లు, గుడిసెలను, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి టిఫిన్ బండ్లు, వీధి వ్యాపారస్తుల రిక్షాలు, ఆటో రిక్షాలు, వారి పనిముట్లు వారు తీసుకువచ్చిన రా మెటీరియల్ చేనేత మగ్గాల మగ్గాలలో నీళ్లు పోయి నష్టం వాటిల్లినందున వాళ్ల మగ్గాల బట్టల తయారీకి వాడే ముడి పదార్థం నష్టం అంచనాను తయారు చేయాలని ఆదేశించారు. వరదలలో పశువులు చాలా కొట్టుకు పోయినట్లు, కొన్ని మరణించాయని, మరికొన్ని ఆచూకీ లేదని, కొన్ని దూర ప్రాంతాల్లో ఉన్న వాటిని యజమానులు గుర్తించి వాటిని తీసుకొని వచ్చారని, చనిపోయిన వాటిని పశుసంవర్ధక శాఖ వారు పంచనామా చేసి నష్టం అంచనా వేయాలన్నారు. పునరావాస కేంద్రాలలో లైట్స్ , జనరేటర్, తాగునీరు, వైద్య శిబిరాలకు అయిన ఖర్చుతో పాటు చేవాణకు అద్దెకు తెచ్చిన వాహనాల వివరాలు, పట్టణ, మండల ప్రాంతాల్లో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు,ఎంపీడీవోలు కలసి నష్టం అంచనాలు రూపొందించి సంతకాలు చేసి మంగళవారం మధ్యాహ్నం నాటికి నివేదిక అందించాలని ఆదేశించారు. వరద బాధితులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం చెక్కు రూపంలో, బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని, దీనికి అనుగుణంగా బాధితుల ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలను సేకరించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్‌లో డీఆర్ఓ పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు

వరద బాధితులకు ఆర్థిక తోడ్పాటు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 9: ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన వరద బాధితులకు జిల్లా ప్రభుత్వ ఉద్యో గుల సంఘం తోడ్పాటు నందించింది. సంఘం తరుపున రూ 80 వేల చెక్కును సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షుడు చాంద్ బాషా, కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, సభ్యులు కరీముల్లా షాఖాదరి, పోతురాజు, సాంబశివరెడ్డి, పద్మజ, లీలాబాయి, రోజా, పెద రత్తయ్య, రహమాన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు రీఓపెనైతే విభాగాధిపతి పరిశీలించాలి

• అదనపు కమిషనర్ కే. రాజ్యలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుండి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్య లక్ష్మీ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ పిజిఆర్ఎస్ నిర్వహించారు. పిజిఆర్ఎస్ ద్వారా కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలను రాజ్యలక్ష్మి స్వీకరించారు. పిజిఆర్ఎస్ కు 23 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 5, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 2, ప్రజారోగ్య విభాగం4, అకౌంట్స్ విభాగంకి సంబంధించి 3 ఫిర్యాదులు ఉన్నాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజల నుండి అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలని,ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్మెంట్ ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు.కార్యక్రమంలో ఎస్.ఈ. శ్యాం సుందర్, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, డిసిపిలు, ఆర్ఓలు , యస్.యస్ లు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.

వైసీపీ నిర్బంధకాండకు నిదర్శనం విజనరీ అరెస్టు: కొమ్మాలపాటి



గుంటూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేయడం వైసీపీ నిర్బంధ కాండకు నిదర్శనమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులో ఆయన సోమవారం విలేకరులతో మాట్లా డుతూ.. ఒక విజన్ ఉన్న నాయకుడిని అక్రమంగా అరెస్టు చేసి సోమ వారానికి ఏడాది పూర్తయిందని, బాబును అక్రమంగా అరెస్టు చేసి పైశాచిక ఆనందాన్ని పొందిన జగన్ మోహనరెడ్డి, అరెస్టు చేసింది ఒక వ్యక్తిని కాదని నీతి, నిజాయితీనని ఒక వ్యక్తిని కాదని ఆయన అన్నారు. వైసీపీ అవినీతి, అరాచక, అక్రమ అరెస్టుల వల్లే ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.

వరద బాధితుల కోసం ఓం వాకర్స్ వితరణ

విజయవాడ నగరంలో వరద ముంపులో చిక్కుకున్న బాధితులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపు మేరకు సోమవారం ఓం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిస్కెట్ ప్యాకెట్లు, హల్దీ రామ్ స్నాక్స్ ప్యాకెట్లు సరఫరా చేశారు. సరుకులు రవాణా చేస్తున్న వాహనాన్ని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర, హనుమంతరావు, వెంకటేశ్వరరావు, జుజ్జూరి శేష ప్రభాకరరావు, సుబ్బారావు, సత్యనారాయణ, సత్యం, గౌరీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు టీజేపీఎస్ విద్యార్థులు ఎంపిక

గుంటూరు (విద్య) సెప్టెంబరు 9 స్థానిక టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న జి. ఏసమ్మ,ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 200 మీటర్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించి ఈ నెల 14న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏబీపీ మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎస్.కె. పర్వీన్ కూడా మార థాన్ 5 కిలో మీటర్ల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి కె.వి బ్రహ్మం, వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజీ, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి జయ శైలజ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు



అక్షయ ఫౌండేషన్ ప్రతినిధికి చెక్కు అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ అచీవర్స్ ప్రతినిధులు

'అక్షయపాత్ర'కు రోటరీ క్లబ్ రూ. 2 కోట్లు విరాళం

• తొలి విడతగా రూ.2 లక్షల చెక్కు అందజేత

• డెల్టా వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

గుంటూరు (విద్య)సెప్టెంబరు 9: వరద ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు పడు తున్న డెల్టా లంక గ్రామాలకు రూ. 90 వేల విలువ గల నిత్యావసర సరుకులతో ఉన్న కిట్లను రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ఆధ్వర్యంలో సోమ వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుంటూరులో జరిగిన రోటరీ పీపుల్ ఆఫ్ యాక్షన్ కార్యక్రమానికి వక్తగా విచ్చేసిన అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి విలాస విగ్రహ దాసకు రూ.2 లక్షల చెక్కును రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ అధ్యక్షులు నల్లూరి సాంబశివరావు, కార్యదర్శి కొండపనేని విజయ్ విజయ్, ట్రెజరర్ గుంటుపల్లి రఘునాధ్ తదితరుల అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వడ్లమాని రవి మాట్లాడుతూ రోటరీ క్లబ్, అక్షయపాత్ర ఆధ్వర్యంలో నిర్మించే వంటశాలకు రూ 2 కోట్లు అందించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి విడతగా రూ. 2లక్షలు అంద జేసినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు దంత పరీక్షలు, కేన్సర్ నివారణ, డయాలిసిస్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రోటరీ గవర్నర్ ఎస్.రాంప్రసాద్, తిలక్‌బాబు, బ్రహ్మారెడ్డి, భరత్‌రెడ్డి, పీవీ సాయిబాబు, వెంకట్, రాంబాబు, పీవీ సత్యనారాయణ, సుబ్బారావు, శివరంజని పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

వరద బాధితులకు టీడీపీ నేతల చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 9: విజయవాడ, వరద ప్రాంత బాధితులకు స్థానిక 48వ డివిజన్ టీడీపీ కార్యకర్తలు అండగా నిలిచారు. స్థానిక వాంబే కాలనీ, రాజరాజేశ్వరిపేట, సింగ్ నగర్, భవానీ పురం ప్రాంతాల్లో బాధి తులకు 10 వేల బిస్కెట్ ప్యాకెట్లు పండ్లు, బ్రెడ్స్, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు పివిఎల్ చారి మాట్లాడుతూ వృత్తి రీత్యా కార్పెం టర్లగా జీవనోపాధి పొందుతున్నా మని, ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే సీఎం నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'విజ్ఞాన్' ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 9: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని వరద ప్రభావిత కాలనీల్లో ఆహారం, బ్రెడ్, నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్ సోమవారం తెలి పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స లర్ మాట్లాడుతూ యూనివర్సిటీలోని 250 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రెండు గ్రూపులుగా చిన్నినగర్, అజిత్ సింగ్ నగర్, వడ్డెర కాలనీ, పీస్టీ నగర్, వైఎస్ఆర్ కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ, తోటవారి వీధి, సింగ్‌నగర్ కాలనీలోని ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. వరద సహాయక చర్యల సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్మెస్ రఘునాథన్ పాల్గొన్నారు.



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

నేత్రదానానికి ముందుకు రావాలి

గుంటూరు,(తూర్పు),సెప్టెంబరు 9: ప్రజలంతా అపోహలు వీడి నేత్రదానానికి ముందుకు రావా లని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి దేవిరెడ్డి కిరణ్మయి కోరారు. కేంద్ర ప్రభుత్వ నెహ్రూ యువకేంద్ర అనుబంధ సంస్థ జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నేత్ర దాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని యువ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయులు టీఎస్ వరప్రసాద్, బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పి.పూర్ణచంద్రరావు, జన చైతన్యసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డి. విజయ్ బెన్నిబాబులు పాల్గొన్నారు.



విఘ్నేశ్వరుడుకి పూజలు నిర్వహిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టీనా, సురేష్ కుమార్

గణనాథుడుకి ప్రత్యేక పూజలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 9: గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీ ప్రాంగణంలో జిల్లా ప్రజా పరిషత్, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ , గ్రామీణ నీటి సరఫరా కార్యాలయముల అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతున్న ఏడోవ గణపతి పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలను విఘ్నేశ్వరుడు అన్ని విఘ్నముల నుండి తప్పించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి ఓటమి కేకలు ఆపాలి: కనపర్తి శ్రీనివాసరావు



గుంటూరు,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయ వాడ వరద బాధితులెవరూ ఆకలి కేకలు వేయడం లేదని, జగన్‌రెడ్డి మాత్రమే ఓటమి కేకలు వేస్తు న్నారని, ఇకనైనా ఆయన ఆ కేకలు ఆపాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీని వాసరావు ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వీలుంటే ఏరియల్ సర్వేలు, లేదంటే పరదాల మాటున పర్యటనలు చేసే జగన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబుని విమర్శించే స్థాయి లేదన్నారు. వారం రోజులుగా ప్రాణాలను కూడా లెక్క చేయకుండా బాధితుల రక్షణ కోసం అహోరాత్రులు శ్రమిస్తున్న బాబుపై విమర్శలు చేస్తే ప్రజలు ఛీ కొడతారని అన్నారు. ఇకనైనా జగన్ ఇలాంటి ట్వీట్లు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నిన్నటి వరకూ చంద్ర బాబుపై ఒంటికాలిపై లేచి విషం కక్కిన కొడాలి నాని, వంశీ, అవినాశ్ లాంటి పిరికిపందలు ఇప్పుడు ఎక్కడ దాక్కున్నా బయటకు రావాలని కనపర్తి సవాల్ విసిరారు.



ఏలూరు బజారులో బెలూన్లతో అలంకరించిన పందిట్లో వినాయకుడు

వైభవంగా నిమజ్జనోత్సవం

గుంటూరు (విద్య), సెప్టెంబరు 9: గుంటూరు స్థానిక సంగడిగుంట మంత్రి వారి వీధిలోని అయ్యప్ప రెసిడెన్సి అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటుచేసిన మట్టి గణపతి విగ్రహానికి గత మూడు రోజుల నుండి విశేష పూజలు, గణపతి హోమాలు నిర్వహించి సోమవారం నిమజ్జనం చేశారు. లడ్డూ వేలంపాటలో రూ. 40,120 కు అప్పల రాము, బాల గణేష్ లడ్డూను రూ.26,000కు మద్ది రవికుమార్ దక్కించుకున్నారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించి గణనాథుని ఊరేగింపుగా తీసుకొని వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు, మద్ది రవికుమార్, అనిల్, రామాంజనేయులు, శేఖర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 45 లక్షల మద్యం సీసాలు ధ్వంసం

• మద్యంసీసాలు తీసుకెళ్ళేందుకు మందుబాబుల యత్నం

• అడ్డుకున్న పోలీసులు

గుంటూరు, సెప్టెంబరు 9 : జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడ్డ రూ.45 లక్షల విలువ చేసే మద్యం సీసాలను పోలీసులు ధ్వంసం చేశారు. స్థానిక లాలాపేట సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో నల్లచెరువు డంపింగ్ యార్డులో జేసీబీతో మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా పర్యవేక్షించారు. మొత్తం 24 వేల 31 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈస్ట్ , వెస్ట్ , నార్త్, సౌత్, తుళ్ళూరు, తెనాలి సబ్ డివిజన్‌లతో పాటు సెబ్ స్టేషన్‌లలో స్వాధీనం చేసుకున్న ఆయా మద్యం సీసా లను ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ వెంక టేశ్వరరావు, ఈస్ట్ ఇన్‌చార్జ్ డీఎస్పీ సుబ్బారావు, లాలాపేట సీఐ శివప్రసాద్, నగరం పాలెం, కొత్తపేట, తెనాలి, నల్లపాడు, ఎస్‌బి, డిసిఆర్‌బి సీఐలు మధుసూదనరావు, వీరయ్య చౌదరి, రమేష్‌బాబు, వంశీధర్, ఆళహరి శ్రీనివాస్, బిలాలుద్దీన్, రాంబాబు, డిసిఆర్బిఐ ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కళ్ల ముందే మద్యం సీసాలను ధ్వంసం చేస్తుంటే మందుబాబులు చూడలేకపోయారు. చివరలో ఒక్కసారిగా మద్యం సీసాలను ఎత్తుకెళ్ళేందుకు ఎగబడ్డారు. మద్యాన్ని మట్టిపాలు చేస్తున్నారంటూ కొంత మంది కొన్ని బాటిళ్ళను ఎత్తుకుపోయినప్పటికీ పోలీసులు అప్రమత్తమయ్యారు. వారిని అడ్డుకుని ఆయా మద్యం సీసాలను లాగేసుకున్నారు. అనంతరం పోలీసులు జేసీబీతో ఆయా బాటిళ్ళనంటిని పూర్తిగా ధ్వంసం చేశారు.



జేసీబీతో బాటిళ్ళను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

సత్య ఏజెన్సీస్ నూతన షోరూం ప్రారంభోత్సవం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న పద్మరాజు, జాన్సన్ తదితరులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 9: తాడేపల్లి బైపాస్‌లోని మణిపాల్ హాస్పిటల్ ఎదురుగా పీఆర్ హైట్స్ నందు 32వ షోరూమ్‌ను సత్య ఏజెన్సీస్ యాజమా న్యం సోమవారం ప్రారంభించింది. నూతన షోరూమ్ ప్రారంభం సందర్భంగా కస్టమర్లకు రూ.40వేల పైన విలువ చేసే షాపింగ్ చేసిన వారికి గోల్డ్ కాయిన్, రూ.30వేలకు పైగా షాపింగ్ చేసిన వారికి ఎల్‌జీ టాన్ ఇయర్ బడ్స్ ఉచితమ ని ప్రకటించారు. షోరూమ్‌ను బిల్డింగ్ ఓనర్ తోలేటి పద్మరాజు, డూండీ మోహన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సత్య ఏజెన్సీస్ యాజమాన్యం మా ట్లాడుతూ ఏపీ వ్యాప్తంగా ఇప్పటివరకు 31 షోరూమ్‌లు ఉన్నాయని, తాడేపల్లి లో 32వ షోరూమ్ ప్రారంభించడం సంతోషకరమని అందరికి అందుబాటు ధర లో వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు లభిస్తాయని కొనుగోలుపై ఆకర్షణీయ బహుమతులు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ ఎండీ జాన్సన్, ఏపీ హెడ్ సెంథిల్, పీఆర్ హైట్స్ కమర్షియల్ కాంప్లెక్స్ డెవలపర్స్, ప్రతినిధులు కొండా ప్రతాప్‌రెడ్డి, తెన్నేటి మహేష్‌రెడ్డి, ప్రముఖ బ్రాండ్ల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 9: మంగళగిరి ఆటోనగర్‌లోని విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. టిప్పర్ల బజారు, మార్కండేయ కాలనీ, రాజీవ్ గృహకల్ప, టిడ్కో సముదాయం, ఆల్ఫా హోటల్, రాయల్ కన్వెన్షన్, ఆటోనగర్, ఎన్నారై వెనుక ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కన్నుల పండువగా మహారుద్రాభిషేకం



మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 9: మంగళగిరి మెయిన్ బజారులో కస్తూరి కంగన్ హాలు వద్ద సంకా బాలాజీగుప్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ పందిరిలో ఆదివారం రాత్రి మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగాన్ని వివిధ రకాల జలాలు, ద్రవ్యాలతో అభిషేకించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రుద్రాభిషేకాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, భారీ వరదల నుంచి ముంపు ప్రాంతాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మహారుద్రాభిషేకం నిర్వహించినట్టు ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ సంకా బాలాజీగుప్తా తెలియజేశారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 3 లక్షల 48వేల క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 202 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 9: ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 3లక్షల 45వేల 702 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.2 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 68 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు 3లక్షల 48 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 202 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

ధన గణపతి అలంకారోత్సవానికి ఏర్పాట్లు

● 13వ తేదీన రూ.2.30 కోట్లతో అలంకారం



కరెన్సీ దండల తయారీలో నిమగ్నమైన బాలాజీగుప్తా కుటుంబసభ్యులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 9: మంగళగిరి మెయిన్ బజారులో స్థానిక వ్యాపారుల సహకారంతో భారీ గణనాథుని విగ్రహం ఏర్పాటు చేశారు. ఒకవైపు ఆంజనేయ స్వామి, మరోవైపు శ్రీరాముని ప్రతిమలతో 22 అడుగుల ఎత్తయిన విఘ్నేశ్వరుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పూలమార్కెట్ సెంటరులోని కస్తూరి కంగన్ హాలు వద్ద ఏర్పాటు చేసిన ఈ వినాయకుణ్ని ప్రతియేటా కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. 18 సంవత్సరాల నుంచి సంకా బాలాజీగుప్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య, ఎస్‌బీజీ యూత్, వ్యాపార సంస్థల సహకారంతో ధన గణపతి అలంకారం చేస్తారు. రూ.లక్షతో ప్రారంభించిన ధన గణపతి అలంకారం ఇప్పుడు రూ.కోట్లకు చేరింది. ఈ ఏడాది రూ.2 కోట్ల 30 లక్షల విలువ చేసే కరెన్సీ నోట్లతో ఈ నెల 13వ తేదీన ధన గణపతి అలంకారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూపాయి నోటు దగ్గరి నుంచి రూ.500 నోట్లతో అమ్మవారి రూపు, పువ్వులు, తోరణాలను నెల రోజుల నుంచి తయారు చేస్తున్నారు. మెయిన్ బజారులోని గృహిణులు, వర్తక, వ్యాపారులు కరెన్సీ దండలను తయారు చేసేందుకు వస్తున్నారు. ఈ అలంకారాన్ని తిలకించేందుకు మంగళగిరి నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తుంటారు.

గ్రామాల్లో పోషకాహార మాసోత్సవాలు



గనికపూడిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9: ప్రత్తిపాడు మండలపరిధిలోని పలు గ్రామాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ప్రత్తిపాడు సెక్టారు పరిధిలోని మార్కెట్ ఏరియా అంగన్వాడీ సెంటర్లో, గొట్టిపాడులోని ముస్లిం ఏరియాల్లోని అంగన్వాడీ సెంటర్లలో జరిగిన కార్యక్రమాల్లో పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. బిడ్డకు ఆరో నెల నుంచి తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందివ్వాలని సూచించారు. ప్రభుత్వం అందించే బాలామృతం గురించి తల్లులకు వివరిస్తూ వాటిని పిల్లలకు ఏ విధంగా అందించాలో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, ఎంఎల్‌హెచ్‌పీ సాత్విక, కార్యకర్తలు అరుణ కుమామారి, బీబీ బత్తుల్, కమలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి తహసీల్దార్‌గా సీతారామయ్య



నూతన తహసీల్దార్ సీతారామయ్యను సత్కరిస్తున్న సిబ్బంది

తాడేపల్లి, సెప్టెంబరు 9: తాడేపల్లి నూతన తహసీల్దార్‌గా డి.సీతారామయ్య సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో బాపట్ల కోఆర్డినేషన్ డిపార్టుమెంట్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేసి అనంతరం అక్కడ నుంచి బదిలీపై తాడేపల్లి విచ్చేశారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం మహానాడు వరద ప్రభావిత ప్రాంతాలకు ఆయన విచ్చేసి ఎన్యుమరేషన్, స్థానిక పరిస్థితులు, బాధితులకు అందుతున్న సహాయక చర్యలపై ఆరాతీశారు. పలువురుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా తొలుత ఉదయం మండల కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. సీతారామయ్య ప్రకాశం జిల్లా అవులమంద స్వగ్రామ నివాసి. అంతకు ముందు గిద్దలూరు, కందుకూరు, అద్దంకి, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో విధి నిర్వహణ చేశారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు

● నష్టం అంచనాలు వేస్తున్న అధికారులు
● ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



వర్షాలకు పూర్తిగా పాడైపోయిన మినుము పైరు

తాడికొండ, సెప్టెంబరు 9: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంటలు వర్షానికి తడిచి పోవటంతో తీవ్రంగా రైతులు నష్టపోయారు. తాడికొండ మండల పరిధి గ్రామాల్లో సుమారు 4500 ఎకరాల్లో వర్షానికి పంటలు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. 630 ఎకరాల్లో వరి, 595 ఎకరాల్లో మినుము, 3155 ఎకరాల్లో పత్తి, 55 ఎకరాల్లో కూరగాయలు, 40 ఎకరాల్లో సోయాబీన్, 40 ఎకరాల్లో కంది, బొప్పాయి 50 ఎకరాలు, జూట్ 200 ఎకరాలు, పెసర, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. మినుము పంట కోతకు వచ్చే సమయంలో భారీ వర్షాలు పడటంతో రైతులు నష్టపోయారు. పత్తి, వరి పొలాల్లో వర్షం నీరు ఇప్పటికి కదలకుండా ఉంది. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నీటిలో నానుతున్న పత్తి పంట

నష్టపోయిన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

తాడేపల్లి, సెప్టెంబరు 9: ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న ప్రతిరైతును ఆదుకునేందుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీభవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం గుంటూరు జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ ఆగస్టు 30, 31 తేదీల్లో అధిక వర్షపాతం నమోదై జిల్లా వ్యాప్తంగా పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, అదేవిధంగా కృష్ణానది ఎగువ నుంచి వరద నీరు అధికంగా రావడం వల్ల దిగువన కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఉన్న లంక పొలాలు పూర్తిగా నీట మునిగాయన్నారు. అంతేగాకుండా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే పంట నష్టం అంచనా వేసి చర్యలు చేపట్టాలని పంటల బీమా గత ఏడాది రైతులకు చెల్లించాల్సిన ప్రీమియం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, ఎం శివసాంబిరెడ్డి, కొత్తా వెంకటశివరావు, మోదుగుల శ్రీనివాసరెడ్డి, కొర్రపోలు ఈశ్వర్‌రెడ్డి, బ్రహ్మేశ్వరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

శివాలయంలో భక్తులకు అన్నదానం

మంగళగిరి, సెప్టెంబరు 9: కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి శివాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. దాతల సహకారంతో ప్రతి నెలా అమావస్య తరువాత వచ్చే సోమవారం నాడు భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ పందేటి సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్టు ప్రతినిధులు కర్నాటి శివసత్యనారాయణ, కగ్గా శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, పాపిశెట్టి నాగరాజు, గండికోట అచ్చయ్య, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, గండికోట దుర్గారావు, దామర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంగం డెయిరీ తరపున పశు దాణా పంపిణీ



హరిశ్చంద్రపురంలో పాడి రైతులకు దాణా అందిస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ కంచర్ల శివరామయ్య

తుళ్లూరు, సెప్టెంబరు 9: మండలపరిధిలోని హరిశ్చంద్రపురంలో సంగం డెయిరీ తరపున పశుదాణాను సోమవారం అందజేశారు. వరదల వల్ల గడ్డివాములు కొట్టుకు పోయాయి. పశువులకు దాణా కొరత ఏర్పడింది. పాడి రైతులను ఆదుకోవటానికి ఉచితంగా దాణా పంపిణీ చేస్తున్నామని సంగం డెయిరీ డైరెక్టర్‌లు కంచర్ల శివరామయ్య, వలివేటి ధర్మారావు ఈ సందర్భంగా తెలిపారు. సంగం డెయిరీ రైతులను ఆదుకోవటానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని జీఎం ప్రసాద్ తెలిపారు. పాల ఉత్పత్తి దారులకు డీవీసీ హస్పటల్ ద్వారా యాభై శాతం రాయితీతో వైద్య సౌకర్యం అందిస్తున్నామన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం సహాయ కార్యక్రమాలతో పాటు సంగం డెయిరీ నుంచి ఉచితంగా పాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కొమ్మినేని కోటేశ్వరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలకు అక్షయ



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న చైర్మన్ నాగేశ్వరరావు

మేడికొండూరు సెప్టెంబర్ 9: జాతీయస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని చిలక అక్షయ ఎంపికైనట్టు శ్రీనివాస పాఠశాల చైర్మన్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మందపాడు గ్రామానికి చెందిన అక్షయ సెప్టెంబరు 1న జరిగిన రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. ఈ నెల 26, 27, 28, 29 తేదీలలో తమిళనాడు ఛంగల్పట్టులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని చైర్మన్ నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా అక్షయను డైరెక్టర్ ఎం.గౌతమి, ఫ్లోర్ బాల్ కార్యదర్శి ఎం కిషోర్ అభినందించారు.

ఆలయంలో హుండీ చోరీ

● టీటీడీ దతత్త తీసుకున్న తరువాత రెండో సారి ఘటన
● సెక్యూరిటి వైఫల్యం వల్లనే అంటున్న గ్రామస్థులు



ఆలయంలో పగల గొట్టిన హుండీ

తుళ్లూరు, సెప్టెంబరు 9: మండల పరిధిలోని అనంతవరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కొండపై ఉన్న ఆలయంలో దుండగులు గర్భగుడిలోకి ప్రవేశించి హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. తెల్లవారుజామున ఆలయంలోకి వెళ్లిన పూజారులు హుండీ ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించి టీటీడీ సిబ్బందికి తెలియ జేశారు. సోమవారం పోలీసులు క్లూసిం టీంతో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. హుండీలో మూడు నెలల కానుకలు ఉన్నట్లు భక్తులు తెలిపారు. ఆలయంలో టీటీడీ సెక్యూరిటీ తొమ్మిది మంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. హుండీ దొంగతనం జరిగిన ఆదివారం రాత్రి పైన సెక్యూరిటి సిబ్బంది కాపాలా లేకుండా కింద ఆఫీసులో పడుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకున్న కొన్ని నెలలకే హుండీ చోరీ జరిగింది. ఇప్పుడు మళ్లీ చోరీ జరగటంపై భక్తులు, గ్రామస్థులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

గణేషుని లడ్డూ రూ.3 లక్షల 5 వేలు



లడ్డు దక్కించుకున్న భక్తులతో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు

మేడికొండూరు, సెప్టెంబరు 9: మండలంపరిధిలోని పేరేచర్ల గ్రామంలో వరసిద్ధి వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యం ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద సోమవారం నిర్వహించిన వేలంలో లడ్డూ రూ.3 లక్షల 5 వేలు పలికింది. ఉప్పుటూరు సుబ్బారావు కుమార్తె తనూజ వేలంలో లడ్డూని దక్కించుకున్నారు. అనంతరం ప్రారంభించిన నిమజ్జన కార్యక్రమంలో గ్రామ వీధులతో గణేషుని విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడికొండూరు మాజీ జడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, మాజీ సర్పంచ్ గడ్డ రాంబాబు, మానుకొండ బ్రహ్మయ్య, తెలుగుయువత అధ్యక్షుడు మానుకొండ బ్రహ్మాజీ, గడ్డం ఉదయ లక్ష్మి, పాములపాటి శ్రీనివాసరావు, నేతలు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో 51వేలకు శ్రీకాంత్ కైవసం



లడ్డును ఊరేగింపుగా తీసుకొని వెళుతున్న శ్రీకాంత్

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 9: వట్టిచెరుకూరు గ్రామంలోని శివాలయం వద్ద రాయల్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఉన్న లడ్డుకు సోమవారం వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ముప్పా గోపాలకృష్ణ కుమారుడు శ్రీకాంత్ రూ.51 వేలకు కైవసం చేసుకున్నారు. కనకతప్పెట్లతో భారీ ఊరేగింపుతో నిమర్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంటల నష్టం అంచనాలను వేగవంతం చేయాలి

● ఏవో కిరణ్మయి

కాకుమాను, సెప్టెంబరు 9: వరదల ప్రభావంతో నష్టపోయిన రైతుల పంటల నష్టాల అంచనాలను వేగవంతం చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి అన్నారు. కాకుమాను, అప్పాపురం గ్రామాల్లో సోమవారం లాం శాస్త్రవేత్తలు నగేష్, ప్రతిభ, మనోజ్‌లతో కలసి వరద ప్రభావిత ప్రాంతాల్లోని వరి భూములను సందర్శించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పొలంలో వరద నీరు బయటకు వెళ్లిన తరువాత 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంవోపీ వేసుకోవాలన్నారు. పొటాష్‌ను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. వెద పద్ధతిలో వరిసాగు చేసి నెల రోజుల లోపు ఉన్నట్లయితే వరి మొక్కలు చనిపోయినట్లయితే ఒత్తుగా ఉన్న చోట మొక్కలను సరి చేసుకోవాలన్నారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని వీఏఏలను ఆదేశించారు. ఈకేవైసీలను గడువులోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు శ్వేత కృష్ణప్రియ, మహేంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.

నైజీరియాలో రౌండ్ టేబుల్ సమావేశానికి

● ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్‌బాబు

కాకుమాను, సెప్టెంబరు 9: ఆఫ్రికా దేశాలలో వ్యవసాయాభివృద్ధిని ప్రోత్సహించేందుకు బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ప్రారంభించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి కాకుమానుకు చెందిన ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైజీరియాలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని టీడీపీ మండల నాయకులు సోమవారం తెలిపారు.

అనారోగ్యంతో గణిత ఉపాధ్యాయుడి మృతి

కాకుమాను, సెప్టెంబరు 9: కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కోలిశెట్టి వెంకట సాంబశివరావు ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎంఈవో కేఎఫ్‌కెన్నడి సోమవారం తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారని చెప్పారు. కేవీ సాంబశివరావు నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి చెందిన వారని చెప్పారు. ఐదేళ్లుగా కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నట్లు వివరించారు. ఆయన మృతికి ఎంఈవో-2 విజయ్‌భాస్కర్, హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

మంగళగిరి, సెప్టెంబరు 9: విజయ హెల్త్ కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో పాతమంగళగిరి జీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. దాత బిట్రా శ్రీనివాస్ సహకారంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు సమకూర్చారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి కే స్వాతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ స్పందించిన తీరు అభినందనీయం

● ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్



గ్రామ పంచాయతీలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, టీడీపీ, జనసేన నాయకులు

మంగళగిరి, సెప్టెంబరు 9: భారీ వరదల కారణంగా రాష్ట్రంలో ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన సొంత నిధులను కేటాయించడం అభినందనీయమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. వరదల కారణంగా నష్టపోయిన ఒక్కో గ్రామానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. మంగళగిరి, తాడికొండ, పొన్నూరు నియోజకవర్గ పంచాయతీలకు సోమవారం సాయంత్రం మంగళగిరి తెనాలి ఫ్లైఓవర్ పక్కన ఉన్న సీఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా ప్రభుత్వ ఖజానా నుంచి కాకుండా తన వ్యక్తిగత వేతనం నుంచి రూ.6 కోట్ల నిధులను కేటాయించి పవన్‌కల్యాణ్ గొప్ప మనస్సును చాటుకున్నారని చెప్పారు. పవన్‌కల్యాణ్ చేసిన ఈ సాయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జనసేన అధినేత స్ఫూర్తితో జనసైనికులు వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, జనసేన, టీడీపీ, బీజేపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

సత్య ఏజెన్సీస్ నూతన షోరూం ప్రారంభోత్సవం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న పద్మరాజు, జాన్సన్ తదితరులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 9: తాడేపల్లి బైపాస్‌లోని మణిపాల్ హాస్పిటల్ ఎదురుగా పీఆర్ హైట్స్ నందు 32వ షోరూమ్‌ను సత్య ఏజెన్సీస్ యాజమాన్యం సోమవారం ప్రారంభించింది. నూతన షోరూమ్ ప్రారంభం సందర్భంగా కస్టమర్లకు రూ.40వేల పైన విలువ చేసే షాపింగ్ చేసిన వారికి గోల్డ్ కాయిన్, రూ.30వేలకు పైగా షాపింగ్ చేసిన వారికి ఎల్‌జీ టాన్ ఇయర్ బడ్స్ ఉచితమని ప్రకటించారు. షోరూమ్‌ను బిల్డింగ్ ఓనర్ తోలేటి పద్మరాజు, దూండీ మోహన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సత్య ఏజెన్సీస్ యాజమాన్యం మాట్లాడుతూ ఏపీ వ్యాప్తంగా ఇప్పటివరకు 31 షోరూమ్‌లు ఉన్నాయని, తాడేపల్లిలో 32వ షోరూమ్ ప్రారంభించడం సంతోషకరమని అందరికి అందుబాటు ధరల్లో వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు లభిస్తాయని కొనుగోలుపై ఆకర్షణీయ బహుమతులు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ ఎండీ జాన్సన్, ఏపీ హెడ్ సెంథిల్, పీఆర్ హైట్స్ కమర్షియల్ కాంప్లెక్స్ డెవలపర్స్ ప్రతినిధులు కొండా ప్రతాప్‌రెడ్డి, తెన్నేటి మహేష్‌రెడ్డి, ప్రముఖ బ్రాండ్ల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ స్ఫూర్తితో బాధితులకు సాయం



భోజన ప్యాకెట్లు పంపిణీ చేసిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

తాడేపల్లి, సెప్టెంబరు 9: తాడేపల్లి 3వ వార్డు బూత్ ఇన్‌చార్జి సతీష్ సహకారంతో మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో విజయవాడ వరద బాధితులకు సోమవారం ఆహారం అందజేశారు. 1000 మందికి భోజనం, వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లను భవాని పురంలోని ఊర్మిళ నగర్‌లో సంకురి సతీష్ యూత్ సభ్యులు సోమవారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, గొర్ల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో 3వేల మందికి అన్నదానం

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 9: తాడేపల్లి పట్టణంలోని మహానాడు శ్రీవిఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో 16వ లైనులో ఆదివారం 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. తొలుత గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిఘ్నేశ్వర సేవాసమితి సభ్యు లు సంక్రాంతి అశోక్, చింతా ఆనంద్, నారాయణ; వెంకటేశ్వర్లు, వెంకటపతి, ఈశ్వరరావు, జోషి, పండు, రవి, మధు, లక్ష్మయ్య, బాలకృష్ణ, జంగయ్య, తిరుపతయ్య, కిరణ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, దానబోయిన సుందరరావు యాదవ్, జంగాల వెంకటేష్, ఇట్టా భాస్కర్, ఓలేటి రాము, జుంజు మరియదాస్, అన్నెం కుసుమ, అంకాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం నగదు సాయం



అనంతవరప్పాడు నగదును రత్తయ్యకు అందిస్తున్న సర్పంచ్ దారా వెంకట్రావు, నరేంద్ర, శేఖర్ తదితరులు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 9: వరద బాధితుల కోసం వట్టిచెరుకూరు మండలపరిధిలోని 9 గ్రామాల తెలుగుతమ్ముళ్లు ప్రజల సహకారంతో సేకరించిన ఆరు లక్షల 74వేల ఐదు వందల రూపాయల నగదును ఆయా గ్రామాల నాయకులు సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు, మాజీమంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్యకు అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

గ్రామాల వారీ నగదు వివరాలు

అనంతవర్పాడు రూ.1,78వేలు, లేమల్లెపాడు రూ.1,45 వేలు, చమళ్ళమూడి రూ.లక్ష, కొర్నెపాడు రూ.70వేలు, కుర్నూతల రూ.57వేలు, పల్లపాడు రూ.50 వేలు, గారపా డు రూ.24వేలు, చింతపల్లిపాడు రూ.35వేలు, కోవెలమూడి రూ.15వేలు మొత్తంగా రూ.6,74,500 అందాయన్నారు.

కొనసాగుతున్న ఆహార పొట్లాల పంపిణీ



వరద బాధితులకు ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న రంగిశెట్టి రమేష్‌బాబు, టీడీపీ నాయకులు

దుగ్గిరాల, సెప్టెంబరు 9: మండలపరిధి చిలువూరుకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ బయోఫార్ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్ బాబు, స్థానిక టీడీపీ నాయకులు రంగిశెట్టి ఫౌండేషన్ ద్వారా రంగిశెట్టి రమేష్‌బాబు పర్యవేక్షణలో మరో 4వేల మందికి ఆహార పొట్లాల పంపిణీ సోమవారం కొనసాగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల పిలుపు మేరకు తాడేపల్లి మహానాడు, విజయవాడ సింగ్‌నగర్, పాయకాపురంలోని వరద బాధితులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రంగిశెట్టి జగదీష్‌బాబు సేవలను అభినందించారు. ఆహార పొట్లాలను అశోక్ లైలాండ్ మినీ ట్రక్ వాహనం ద్వారా తాడేపల్లి మహానాడు, సింగ్‌నగర్‌లకు తరలించి, టీడీపీ, జనసేన శ్రేణులతో పంపిణీ చేయించారు.



వరద బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వరద బాధితులకు రోటరీ క్లబ్ సేవలు

● రూ.25 లక్షల విలువచేసే నిత్యావసరాల పంపిణీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: వరద బాధితులకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. సోమవారం రోటరీ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి ఆదేశాల మేరకు 23 రోటరీ క్లబ్‌ల సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిత్యావసరాల కిట్లను కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలోని 10 లంక గ్రామాల వరద బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ ఎస్వీ రాంప్రసాద్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ తాళం రాజశేఖరరెడ్డి, డాక్టర్ విష్ణులు పాల్గొని వరద బాధితులకు రూ.25లక్షలు విలువ చేసే సరుకుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డి.మురళీకృష్ణ, ఇంటర్ క్లబ్ రిలేషన్ జోనల్ చైర్ పర్సన్ ఈదర వెంకట పూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ డి.రవీంద్రనాథ్, జీవీ నారాయణ, గుమ్మడి ప్రసాద్, చేతన్‌రాజ్ కొఠారీ, ఆలపాటి వెంకటరామయ్య అర్జున్, కుర్రా శ్రీనివాసరావు, హరిప్రసాద్, కిరణ్‌చౌదరి, ఉపేంద్ర, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు వినూత్న



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వినూత్నతో కోచ్ నాగరాజు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: స్థానిక చెంచుపేటలోని యూనిక్ తైక్వాండో అకాడమీలో సోమవారం ఖేలో ఇండియా మహిళా తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన తైక్వాండో విద్యార్థిని వినూత్నను కోచ్ బట్టు నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఈ నెల చిత్తూరు జిల్లా తిరుపతి నేషనల్ సాంస్క్రీట్ యూనివర్సిటీలో జరిగిన రెండో ఖేలో ఇండియా ఉమెన్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఆ పోటీల్లో ప్రతిభ కనపరిచిన ఏ వినూత్న 63 కేజీల జూనియర్ కేటగిరీలో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు తమిళనాడులో జరిగే పోటీలకు ఎంపికైందని తెలిపారు. అకాడమీ గౌరవాధ్యక్షుడు బాల చంద్రమౌళి వినూత్నను అభినందించి, మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

వృద్ధాశ్రంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: వృద్ధాశ్రంలోని వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలోని ఎస్వీ యోగా సభ్యుడు ఇంత శోభనాద్రిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, అనూష, జగదీశ్వరీ, ఉమామహేశ్వరావు, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి వెంకట్రామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పట్టణ వాసులు

ఘనంగా మాజీమంత్రి వెంకట్రామయ్య జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 9: మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. జీడీసీసీ బ్యాంకు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెనాలి పట్టణానికి, నియోజకవర్గానికి ఆయన మున్సిపల్ చైర్మన్‌గా, మంత్రిగా చేసిన సేవలను పలువురు వక్తలు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆలపాటి వెంకట్రామయ్య, నేలటూరి బెన్ను, రాజశేఖరరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నేలపాడులో ఈ క్రాప్ నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఏడీఏ ఉషారాణి

ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

● ఏడీఏ ఉషారాణి

తెనాలి రూరల్, సెప్టెంబరు 9: సాగు చేపట్టిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ ద్వారా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ ఉషారాణి కోరారు. సోమవారం మండలంలోని నేలపాడులో ఆమె క్షేత్రస్థాయిలో పైర్లను పరిశీలించి అనంతరం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ వరద ఉధృతి కారణంగా పంటలు నష్టం జరిగిన ప్రతి రైతుకు పరిహారం అందాలంటే తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసి ఉండాలన్నారు. రైతులందరూ వ్యవసాయ శాఖ చేసే సూచనలను పాటిస్తూ ఈ నెల 11లోగా రైతు సేవా కేంద్రాలను, లేదా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని, గ్రామ వీఆర్వోలను సంప్రదించి పంటనమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. రైతులు ఎవ్వరూ కూడా అధైర్యపడవద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని ఆమె భరోసా కల్పించారు. పలువురు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ మద్యం బాటిళ్ళను ధ్వంసం చేస్తున్న పోలీసు అధికారులు

అక్రమ మద్యం బాటిళ్లు ధ్వంసం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: జిల్లా వ్యాప్తంగా పలు కేసులలో పట్టుబడిన అక్రమ మద్యం బాటిళ్లతో పాటు త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధితో పట్టుకున్న అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ త్రీటౌన్ పరిధిలో పట్టుబడిన 48 కేసుల అక్రమ మద్యం బాటిళ్లతో పాటు గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని డివిజన్ల పరిధిలో పట్టుకున్న 24వేల అక్రమ మద్యం బాటిళ్ళ విలువ 50లక్షలు. 4626 లీటర్ల మద్యం బాటిళ్ళలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు గుంటూరు ఏటుకూరు రోడ్డులోని డంపింగ్ యార్డులో జేసీబీతో తొక్కించి ధ్వంసం చేసినటు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు.

జ్వరపీడితులతో ప్రభుత్వాసుపత్రి కిటకిట

● జ్వరబాధితులతో నిండిపోయిన మంచాలు
● మంచాల కొరతతో రోగుల పాట్లు
● డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా బాధితులే అధికం
● జాగ్రత్తపాటించాలంటున్న వైద్యులు



చికిత్స పొందుతున్న జ్వరపీడితులతో నిండిపోయిన మంచాలు

తెనాలి రూరల్, సెప్టెంబరు 9: జిల్లాలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ వైద్యశాలగా పేరుగాంచిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో జ్వరపీడితులు నానాటికి పెరుగుతుండటంతో రోగులకు బెడ్లు కొరత ఏర్పడింది. గత 10 రోజుల క్రితం వరకూ కూడా కేసులు నియంత్రణ కాగా వారం రోజుల నుంచి జ్వరం, జలుబు, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులతో వైద్యశాలను ఆశ్రయించే వారి సంఖ్య పెరిగింది. ప్రతి రోజు దాదాపుగా 500 ఓపీ విభాగానికి జ్వరపీడితులు వస్తున్నారు. వారికి వైద్యులు రక్తపరీక్షలకు సిఫారసు చేస్తుండగా పలువురికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, స్వల్పంగా డయేరియా కేసులుగా నిర్ధారణ అవుతున్నాయి. దీంతో వారికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించాల్సి ఉండగా ఒక్కో వార్డుకు దాదాపుగా 56 పడకలు ఉండగా 40 వరకూ నిండిఉంటున్నారు. మిగిలిన బెడ్లు మరమ్మతులకు గురైనవి కావడంతో కొరత ఏర్పడింది. ఆయా వ్యాధులు అదుపులోకి రావడానికి రోగి సుమారుగా 3 రోజుల వరకూ వైద్యశాల్లో చికిత్స పొందాల్సి ఉంటుంది. దీంతో వారు డిశ్చార్జ్ కాకముందే జ్వరం వంటి సమస్యలో ఆసుపత్రికి వచ్చే రోగులు పెరుగుతుండటంతో చికిత్స అందించేందుకు వైద్యులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. వచ్చిన రోగులను తిరిగి పంపించలేక ఉన్న వార్డుల్లోనే అతికష్టంగా చికిత్స అందిస్తున్నారు. ఏ వార్డుకు వెళ్లినా జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులతో వైద్యశాల కిటకిటలాడుతోంది. పెరుగుతున్న జ్వరపీడితులకు వైద్యం అందేలా వార్డులో బెడ్లు, వైద్యులు, సిబ్బందిని పెంచాలని పలువురు రోగులు, వారి బంధువులు విజ్ఞప్తిచేస్తున్నారు. కాగా అసలు అనారోగ్య సమస్యలకు ప్రధానంగా దోమకాటు, కలుషితమైన ఆహారం తీసుకోవడం, అపరిశుభ్ర వాతావరణంలో ఉండటమే కారణమని వైద్యులు వివరిస్తున్నారు. గత వారం రోజులకు పైగా వర్షాలు పడటం, నీళ్లు నిలిచి అపరిశుభ్ర వాతావరణం నెలకొని దోమలు వృద్ధిచెందడం వంటి కారణాలతో పాటు కలుషితమైన ఆహార పదార్థాలను తినడం కూడా మరో కారణమని వైద్యులు తెలిపారు. ప్రజలందరూ వైద్యులు చేసే సూచనలను పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీరు నిలవ లేకుండా చూసుకోవాలని కోరారు. కొళాయిల నుండి, బోర్ల నుంచి వచ్చే నీటిని తప్పనిసరిగా కాచిచల్లార్చిన తురువాతే తాగాలన్నారు. పరిశుభ్రమైన బిందెలను, వాటిపై మూతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బయట ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్, పానీపూరి, నిల్వ ఉన్న ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దన్నారు. దోమలు ఇంట్లో పరిసరాల్లో చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు రాత్రిపూట తప్పనిసరిగా ఒంటికి నిండుగా బట్టలు ధరించడం, దోమతెరలు వినియోగిస్తే, సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు వహించిన వారమవుతామని ప్రభుత్వవైద్యశాల డాక్టర్ వినీల్ వివరించారు.

వరద బాధితులను ఆదుకోవటమే ప్రథమ లక్ష్యం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ● చేబ్రోలులో 250 కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), సెప్టెంబరు 9: వరద బాధితులను ఆదుకోవటమే ప్రభుత్వ ప్రథమలక్ష్యం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చేబ్రోలు పాతరెడ్డిపాలెంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన 250 కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన 25 కిలోల బియ్యం ఒక కేజి పంచదార, కేజి కందిపప్పు, లీటర్ పామాయిల్, రెండు కిలోల ఉల్లిపాయలు, రెండు కిలోల బంగాళదుంపలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పొన్నూరు పరిసర ప్రాంతాలో భారీవర్షాల వల్ల అపారనష్టం వాటిల్లిందన్నారు. పెదకాకాని ప్రాంతంలో వరదరావటం మొదటిసారి చూస్తున్నామన్నారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు సమన్వయంతో వ్యవహరించి వరదపోటు పెరగకుండా సమిష్టిగా వ్యవహరించారని కొనియాడారు. విజయవాడలో బుడమేరు పొంగి అపార నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలోని యంత్రాంగం ముఖ్యమంత్రి, మంత్రులు వరద ప్రాంతాలో సహాయ చర్యల్లో రాత్రింబవళ్లు నిమగ్నమైవుంటే మరోవైపు ప్రతిపక్ష నేత సహకారం అందించకుండా విమర్శలకే పరిమితమైయ్యారని ఎద్దేవా చేశారు. వరద ప్రాంతాలలో అరగంట పర్యటించి రాజకీయ విమర్శలకు పరిమితమైపోయారని జగన్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. ప్రభుత్వం వరద ప్రాంత ప్రజలను, రైతులను ఆదుకోవటమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మైల వెంకట రామరాజు, అనంతలక్ష్మీ నారాయణ, టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వితరణ ప్రశంసనీయం

ఎమ్మెల్యేలు నరేంద్ర, శ్రావణ్



పెదకాకాని గ్రామపంచాయతీకి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే నరేంద్రకుమార్, శ్రావణ్ కుమార్ తదితరులు

పెదకాకాని, సెప్టెంబరు 9: రాష్ట్రంలో వరద బాధితుల కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చూపిన చొరవ ప్రశంసనీయమని ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, తెనాలి శ్రావణ్ కుమారులు కొనియాడారు. పవన్ కళ్యాణ్ 1,00,000/- చొప్పున సాయం చెక్కుల పంపిణీలో భాగంగా పొన్నూరు నియోజకవర్గం పెదకాకాని మండలంలోని 11 గ్రామాలకు ఒక్కొక్క గ్రామానికి లక్ష చొప్పున అందజేశారు. మంగళగిరి నియోజకవర్గం జనసేన సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ప్యాలెస్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్‌కుమార్, పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, మంగళగిరి తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త నందం అబద్దయ్యలు అందచేశారు. కార్యక్రమంలో పెదకాకాని మండలంలోని 12 గ్రామాల సర్పంచులు, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కల్యాణ్ ఉదార స్వభావం కలిగిన వ్యక్తిని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు వీరేళ్ల వెంకటేశ్వరరావు ప్రశంసించారు. సోమవారం పెదకాకాని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ 400 గ్రామపంచాయతీలకు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. పెదకాకాని మండ లంలో 12 గ్రామ పంచాయతీలకు విరాళాలను ఇచ్చారన్నారు. చనిపోయిన కౌలు రైతుల కోసం పవన్ కల్యాణ్ 30కోట్ల రూపాయల విరాళం ఇచ్చారన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, పొన్నూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు మారుతి కుమార్, పెదకాకాని గ్రామ పార్టీ అధ్యక్షుడు మండలం శ్రీనివాస్, మునగా కోటేశ్వరావు, సీనియర్ నాయకులు బండారు అప్పారావు, బండారు శ్రీనివాస్, కొసనా ప్రసాద్ , సెక్రటరీలు దంతాల ఆంజనేయులు, రవి, బీసీ నాయకులు దూపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు.. అన్నదానాలు



పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న మంత్రి మనోహర్



కొల్లిపరలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కొల్లిపర, సెప్టెంబరు 9: మండలంలో మూడు రోజులుగా వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట, దావులూరు, చక్రాయపాలెం గ్రామాల్లో పూజలు చేయించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడో రోజున కొన్ని గ్రామాల్లో గణనాథుడికి ఉద్వాసన పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై విగ్రహాన్ని ఉంచి గ్రామాల్లో కనక తప్పెట్లు, బాణ సంచా కాల్చుతూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

తెనాలిలో మాజీమంత్రి ఆలపాటి పూజలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 9: తెనాలిలో జరిగిన వినాయక చవితి పూజల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం సందర్శించారు. సోమసుందరపాలెంలో శివయ్య, వినోద్, ప్రణీత్, నాని, కేసన కోటేశ్వరరావు, ఫణీంద్ర ఆయనకు స్వాగతం పలికారు. బాస్కరరావుపేటలో నాగుపాముపై వినాయక విగ్రహాన్ని దర్శించుకున్నారు. గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ 15అడుగుల నాగుపాముపై విగ్రహం ఉండేలా తీర్చిదిద్దారు. వల్లెం మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు. నందులపేటలో 18అడుగుల ఎత్తులో బాలాపూర్ గణపతిని ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పంచ ముఖ వినాయకుని ఏర్పాటు చేశారు. నందులపేటలో విష్ణు రాజాయూత్ నిర్వాహకులు లక్ష్మణ్, ప్రణీత్ తదితరులు ఏర్పాటు చేసిన విగ్రహ పూజల్లో మాజీ మంత్రి పాల్గొన్నారు.



వినాయక విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి

● తెనాలిరూరల్: సోమవారం జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్ పద్మశాలియూత్ ఆధ్వర్యంలో 29వ గణేష్ మహోత్సవాలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరై స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: తెనాలిలో వీఎస్ఆర్ కళాశాల సమీపంలో ప్రధాన రహదారిపై కొలువైఉన్న భారీ వినాయక స్వామి వారిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ పట్టణ , మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంగలకుదురులో వైభవంగా నిమజ్జనం

తెనాలి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని అంగలకుదురులో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు. సోమవారం స్వామి వారి నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని నిమజ్జనంలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, తెనాలి హెచ్‌సీవీ అధినేత కరణం వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, ఇతర నాయకులు పర్యవేక్షించారు.

వరద బాధితులకు వాకర్స్ విరాళం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 9: వరద బాధితులను ఆదుకునేందుకు వాకర్స్ క్లబ్ విరాళం అందించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సోమవారం రూ.1,15,000/లు చెక్కును అందజేశారు. వాకర్స్ క్లబ్ సభ్యులను మంత్రి అభినందించారు. డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, బొప్పా వెంకటరత్నం, కడియాల రవి, బొబ్బా వెంకటేశ్వరరావు, రత్తయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మనోహర్‌కు చెక్కు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మృతురాలికి ఎమ్మెల్యే నివాళి

చేబ్రోలు, సెప్టెంబరు 9: మండల పరిధిలోని మంచాల గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు చందు పున్నారావును సోమవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పరామర్శించారు. పున్నారావు సతీమణి చందు సింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సింగమ్మ చిత్రపటానికి నరేంద్ర కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పున్నారావును పరామర్శించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశమ్మతల్లి పూజలకు విరాళం

తెనాలి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని సంగంజాగర్లమూడి నిమ్మలపాలెంలోని దేశమ్మతల్లి అమ్మవారి పూజలకు గ్రామ టీడీపీ నాయకులు కొత్తరమేష్‌బాబు రూ.20వేలు నగదును అందజేశారు. సోమవారం నిర్వాహక కమిటీ సభ్యులకు నగదును అందించి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సంగం డెయిరీ: గుత్తికొండ

కొల్లిపర, సెప్టెంబరు 9: రైతులకు అండగా సంగం డెయిరీ ఉంటుందని సంగం డెయిరీ డైరెక్టర్ గుత్తికొండ లక్ష్మిజ్ఞానానందభగవాన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నవరంలంకలో సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వడ్లమూడి వారి సౌజన్యంతో వరద బాధిత రైతులకు ఆయన డెయిరీ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, సంఘ సభ్యులతో కలిసి ఉచితంగా పశువుల దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అద్దేపల్లి రమేష్‌బాబు, లోకమ్మ, సంగం డెయిరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన్నవ వీఆర్వోపై ఫిర్యాదు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 9: మన్నవ వీఆర్వో రత్నమయి గత మూడు నెలల నుంచి గ్రామ సచివాలయానికి రాకుండా దొప్పలపూడిలోనే విధులు నిర్వహిస్తూ మన్నవ ప్రజలను తీవ్ర ఇబ్బంధులకు గురిచేస్తుందని గ్రామ ఎస్సీ కాలనీ వాసులు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంతిని ఫిర్యాదు చేశారు. మన్నవ గ్రామంలో నిరుపేదలకు 2019లో నివేశన స్థలాలు మంజూరు చేయగా ఆ స్థలాలో గృహాలు నిర్మించుకుని నివసిస్తునట్లు తెలిపారు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొల్లిమర్ల డ్రెయిన్ పొంగి ఇళ్ల స్థలాలు నీట మునిగిపోయి నివసించటానికి అవకాశం లేకుండా ఇబ్బందులు పడుతునట్లు తెలిపారు. తమ ఇబ్బందులను వీఆర్వో రత్నమయికి ఫోన్‌లో పలుసార్లు చెప్పినప్పటికి రత్నమయి నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు ఆరోపించారు. మన్నవ గ్రామానికి రాను మీ సమస్యలు మాకు చెప్పవద్దు నాకు సంబంధం లేదని సమాధానం ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే రెవెన్యూ అసిస్టెంట్ అన్నవరపు అదృష్టవాణిని కలిసి తమ సమస్యలు ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించమని కోరినట్లు చెప్పారు. గత రెండేళ్ల నుంచి వీఆర్వో రత్నమయి వీఆర్ఏ అన్నవరపు అదృష్టవాణిలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారు ఆరోపించారు. అలాగే అడంగల్, 1బీ నమూన వంటి సమస్యలపై సంప్రదిస్తే లంచాలు అడుగుతున్నారని ఆరోపించారు. కౌలు రైతులు కార్డులను కూడా మంజూరు చేయక తీవ్ర ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. వీటిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని మన్నవ ఎస్సీ కాలనీ వాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



కొల్లిపర సమీపంలో వరదలకు దెబ్బతిన్న వాణిజ్య పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

జీవం కోల్పోయిన వాణిజ్య పంటలు

● జిల్లా ఉద్యానవన శాఖాధికారి రవీంద్రబాబు

కొల్లిపర, సెప్టెంబరు 9: కృష్ణానది వరదలు కారణంగా పంటలు నీటమునటంతో వాణిజ్య పంటలు జీవం కోల్పోయాయని జిల్లా ఉద్యానవన శాఖాధికారి రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండలంలోని పిడపర్తిపాలెం, కొల్లిపర, కొత్తబొమ్మువానిపాలెం, బొమ్మువానిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి వరద బారిన పడిన ఉద్యాన పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ 90శాతం పైగా వాణిజ్య పంటలు ముంపు బారిన పడినట్లు తెలిపారు. కరకట్టకు ఇవతల ఉన్న భూముల్లో అధిక వర్షాలు వలన పంటలు తెగుళ్లు బారిన పడే అవకాశం ఉందని ఉద్యానవన శాఖాధికారుల సూచనలు మేరకు మందులను పిచికారీ చేసి నివారించుకోవాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.గిరిధర్ మాట్లాడుతూ పంటలు పూర్తిగా దెబ్బతిని పంటలు ఎండిపోతే వాటిని తీసివేసి మరల పెసర, మినుము, జొన్న, మొక్క.జొన్న, కూరగాయల పంటలు వేసుకోవడం మంచిదన్నారు. ఏవో వెంకట్రావు మాట్లాడుతూ వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు నమోదు చేస్తున్నారని రైతులు దగ్గర ఉండి నమోదు చేయించు కోవాలన్నారు. వరదకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వారిలో శాస్త్రవేత్త డాక్టర్ తనుజాప్రియ, వ్యవసాయ విస్తరణాధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.



వరద బాధితులకు అన్నదానం చేస్తున్న శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవ సేవాసమితి సభ్యులు

వరద బాధితులకు అన్నదానం

కొల్లిపర, సెప్టెంబరు 9: శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవ సేవాసమితి బుర్రిపాలెం ఆధ్వర్యంలో సోమవారం కొల్లిపర మండలం పాతబొమ్మువానిపాలెంలో వరద బాధిత 400మంది కుటుంబాలకు సమితి సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవ సేవాసమితి ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. లంకగ్రామాల ప్రజలు ఎవరైతే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో వారికి తగిన సాయం అందజేయటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.